# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 244 | శనివారం 16 మార్చి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


## మల్కాజిగిరిలో ప్రధాని మోదీ రోడ్‌షో



- హైదరాబాద్‌లో మోదీ రోడ్ షో
- మల్కాజ్ గిరి నియోజకవర్గంలో మోదీ రోడ్ షో
- మీర్జాలగూడ నుంచి మల్కాజ్ గిరి వరకు రోడ్ షో
- రోడ్ షోలో పాల్గొన్న కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్

హైదరాబాద్:

ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్ చేరుకున్నారు. నగరంలోని మల్కాజ్ గిరి నియోజకవర్గంలో ఆయన రోడ్ షో నిర్వహిస్తున్నారు. మీర్జాలగూడ నుంచి మల్కాజ్ గిరి వరకు రోడ్ షో కొనసాగనుంది. విజయ్ సంకల్ప్ పేరుతో ఈ రోడ్ షోను నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ పర్యటిస్తున్నారు. మల్కాజిగిరి రోడ్‌షోలో -మిగతా3లో



## కాంగ్రెస్ ప్రభుత్వానికి 100 రోజులు

### ఆరుకు నూరు మార్కులెప్పుడు?

### ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామన్న ప్రభుత్వం

### గడువు పూర్తి కావడంతో రాజకీయ వర్గాలు, ప్రజల్లో చర్చ

- పార్టీ మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీల పేరిట 13 హామీలు
- ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్ అమలు షురూ
- రైతు భరోసా, విద్యా భరోసా, పింఛన్ల
- పెంపు తదితరాలపై దృష్టి సారించని సర్కారు
- హామీలన్నీ నెరవేరాలంటే ఏటా రూ.1.30 లక్షల కోట్లు అవసరమన్న నిపుణులు
- బడ్జెట్‌లో రూ.53 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం

హైదరాబాద్

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. శుక్రవారంతో కాంగ్రెస్ పాలనకు వంద రోజులు పూర్తి కానుండటంతో, ప్రభుత్వ పనితీరుపై రాజకీయ వర్గాలు, ప్రజల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇంత స్వల్ప వ్యవధిలో ప్రభుత్వ పనితీరును అంచనా వేయడం సరికాక పోయినా, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రకటన చేయడం చర్చకు తావిచ్చింది. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీల పేరుతో 13 హామీలను పొందుపరిచింది. ఈ 13 పథకాల అమలుకు ఏటా దాదాపు రూ.1.30 లక్షల కోట్లు అవసరమని నిపుణులు అంచనా వేశారు. కానీ ప్రభుత్వం వీటికి బడ్జెట్‌లో రూ.53 వేల కోట్లే కేటాయించింది. దీనిపై అప్పట్లోనే విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా ఇప్పటివరకు ఐదు -మిగతా3లో



## పక్కా ప్లాన్‌తోనే కవిత అరెస్ట్

- బీఆర్ఎస్ వ్యతిరేక ఓటుతో మూడు సీట్లు గెలవచ్చని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆశ పెట్టుకున్నారు
- ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక నేతలను అరెస్టు చేసిన సమయంలో కవితను ఎందుకు అరెస్టు చేయలేదు
- ఎన్నికల ముందు మోదీ, అమిత్ షా రైడ్స్, మ్యాచ్ ఫిక్స్ చేస్తున్నారు
- బీఆర్ఎస్ ఇక తెలంగాణలో ఉండదు
- బీజేపీ రెండు ఎంపీ సీట్లను కూడా రాష్ట్రంలో గెలవదు

నల్గొండ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేస్తే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ వ్యతిరేక ఓటుతో మూడు సీట్లు గెలవచ్చని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆశ పెట్టుకున్నారని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రేపు (శనివారం) ఎన్నికల షెడ్యూల్ వచ్చే ముందు కవిత ఇంటి మీద ఐటీ, ఈడీ, సీబీఐ పోలీసులతో మోదీ, అమిత్ షా -మిగతా3లో

## లిక్కర్ స్కాంలో కవిత అరెస్ట్



- కవిత ఇంటి దగ్గర హైటెన్షన్
- ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కవిత అరెస్ట్
- కవిత ఫోన్లు, పీఏ ఫోన్లు స్వాధీనం
- కవితను అరెస్ట్ చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- రాత్రి 8.45గం. విమానంలో కవితను ఢిల్లీకి తరలింపు
- కవిత ఇంటి ముందు గేటు బయట బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

హైదరాబాద్

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత అరెస్ట్ కావడంతో ఆమె ఇంటి దగ్గర హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కవిత ఇంటి ముందు బీఆర్ఎస్ శ్రేణుల నిరసనకు దిగడంతో భారీగా పోలీసులు మోహరించారు. కవిత ఇంటికి కేటీఆర్, హరీష్‌రావు చేరుకున్నారు. రాత్రి 8.45 నిమిషాలకు కవితను ఢిల్లీకి తరలించనున్నారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కయ్యిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కవిత నివాసం వద్ద నిరసనకు దిగిన ఆమె అనుచరులు బీజేపీ, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఎలా అరెస్టు చేస్తారంటూ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్ట్ చేయబోమని సుప్రీంకోర్టుకు చెప్పిన ఈడీ ఎలా అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు. కేసు కోర్టులో ఉండగా.. దాడులు ఎలా చేస్తారంటూ -మిగతా3లో



## ప్రజాస్వామ్యంలో అత్యున్నత పదవులుగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని

- రాష్ట్రపతి, ప్రధానమంత్రి ఎంత జీతం తీసుకుంటారో తెలుసా...!
- పదవులకు తగ్గట్టే భారీ వేతనాలు, ఉచిత సౌకర్యాలు
- పదవి నుంచి తప్పుకున్నాక కూడా భారీగా పెన్షన్లు, సదుపాయాలు

## నేడు ఎన్నిక షెడ్యూల్ ప్రకటన

వెల్లడించిన ఈసీ

మధ్యాహ్నం మూడు గంటలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల

లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, సిక్కిం, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు ఏకకాలంలో అసెంబ్లీ ఎన్నికలు

## కవితపై కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం మాకు లేదు




- ఎలాంటి నేరం చేయనప్పుడు కవితకు భయమెందుకు? అని కిషన్ రెడ్డి ప్రశ్న
- ఇన్నాళ్లు ఈడీ విచారణకు సహకరించకుండా కవిత తప్పించుకున్నారని ఆరోపణ
- విచారణ సంస్థలు తమ పని తాము చేసుకొని పోతాయన్న కిషన్ రెడ్డి

హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితపై కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం తమకు లేదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 12 మంది ఈడీ అధికారులు ఈ రోజు కవిత నివాసానికి వెళ్లి నాలుగైదు గంటలు విచారించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఈ అంశంపై కిషన్ రెడ్డి స్పందించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఢిల్లీ మద్యం కేసులో ఎలాంటి నేరం చేయనప్పుడు కవితకు భయమెందుకు? అని ప్రశ్నించారు. ఈడీ విచారణకు కవిత పూర్తిగా సహకరించాలని -మిగతా3లో

## కంపెనీలపై దాడులు.. 'అన్నీ ఊహలు..అవాస్తవాలే'



- విరాళాలకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దాడులకు సంబంధం ఉందంటూ జరుగుతున్న ప్రచారం వాస్తవం
- ఈడీ కంపెనీలపై రైడ్ చేస్తేనే ఆత్మరక్షణ కోసం ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశారనుకోవడం ఊహాగానమే
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

# ప్రజాస్వామ్యంలో అత్యున్నత పదవులుగా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని

ప్రజాస్వామ్య వ్యవస్థలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి అనేవి అత్యున్నత పదవులు. వారి జీతభత్యాలు కూడా వారి పదవుల స్థాయికి తగ్గట్టే ఘనంగా ఉంటాయి. వీరి వేతనాలను కాలానుగుణంగా సవరిస్తుంటారు. వీరిలో రాష్ట్రపతికి అత్యధిక వేతనం లభిస్తుంది. వేతనమే కాదు, ఇతర భత్యాలు, సౌకర్యాలు కూడా భారీగానే లభిస్తాయి.



**రాష్ట్రపతి...**

భారత కేంద్ర ప్రభుత్వంలో అత్యధిక జీతం అందుకునేది రాష్ట్రపతి. రాష్ట్రపతి నెలకు రూ.5 లక్షల వేతనం అందుకుంటారు. ఆయనకు 340 గదులు ఉన్న రాష్ట్రపతిభవన్ లో బస కల్పిస్తారు. ప్రపంచంలో ఎక్కడికైనా సరే రాష్ట్రపతికి ఉచిత విమాన, రైలు ప్రయాణ సదుపాయాలు కల్పిస్తారు. ఉచిత నివాస సౌకర్యం, ఉచిత ఆరోగ్య సదుపాయం, ఆఫీసు ఖర్చుల కోసం ఏడాదికి రూ.1 లక్ష అందిస్తారు. రాష్ట్రపతి పదవీ విరమణ చేశాక నెలకు రూ.1.5 లక్షల పెన్షన్ లభిస్తుంది. రిటైరయ్యాక పూర్తి ఫర్నిచర్ తో కూడిన బంగ్లాలో ఉచిత నివాసం. రెండు ల్యాండ్ లైన్లు, ఒక మొబైల్ ఫోన్ కూడా ఉచితం మాజీ రాష్ట్రపతి సేవల కోసం ఐదుగురు సిబ్బంది కేటాయింపు. వారి బాగోగుల కోసం ఏడాదికి రూ.60 వేల భత్యం. మాజీ రాష్ట్రపతితో పాటు ఒకరికి విమానంలో కానీ, రైలులో కానీ ఉచిత ప్రయాణం.

**ఉప రాష్ట్రపతి...**

ఉప రాష్ట్రపతికి నెలకు రూ.4 లక్షల జీతం చెల్లిస్తారు. జీతానికి అదనంగా రోజువారీ భత్యాలు. ఉచిత నివాసం, ఉచిత వైద్య సేవలు, ఉచిత విమాన ప్రయాణం, ఉచిత రైలు ప్రయాణం, ఉచితంగా ల్యాండ్ లైన్, ఉచితంగా మొబైల్ ఫోన్ సేవలు లభిస్తాయి. ఉప రాష్ట్రపతిగా పదవీ విరమణ చేశాక నెలకు రూ.1.5 లక్షల పెన్షన్ అందిస్తారు. రాష్ట్రపతి గైర్హాజరీలో ఉప రాష్ట్రపతే ప్రథమ పౌరుడిగా సేవలు అందించిన సమయంలో రాష్ట్రపతి వేతనం, ఇతర ప్రయోజనాలు అందిస్తారు. రాష్ట్రపతికి లభించే అన్ని సదుపాయాలు ఉప రాష్ట్రపతికి లభిస్తాయి.

**ప్రధానమంత్రి....**

ప్రధానమంత్రికి నెలకు రూ.1.66 లక్షల వేతనం ఇస్తారు. ఇందులో బేసిక్ పే రూ.50 వేలుగా ఉంది. అదనంగా... ప్రధానికి ఖర్చుల నిమిత్తం రూ.3 వేలు, పార్లమెంటరీ భత్యం కింద రూ.45 వేలు చెల్లిస్తారు. వీటితో పాటు దినసరి భత్యం కింద ప్రధాని రోజుకు రూ.2 వేలు అందుకుంటారు. ఉచితంగా నివాస సౌకర్యం, ఇతర సదుపాయాలు ఉచితంగా కల్పిస్తారు. ప్రధానమంత్రి రక్షణ బాధ్యతను స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) పర్యవేక్షిస్తుంది. ప్రధాని తన ప్రయాణాల కోసం ఏ ప్రభుత్వ వాహనం అయినా వినియోగించుకోవచ్చు. ఏ ప్రభుత్వ విమానంలో అయినా ప్రయాణం చేయవచ్చు. ప్రధాని విదేశాలకు వెళ్లినప్పుడు ఆయన వసతి, ఆహారం, ప్రయాణ ఖర్చులన్నీ కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. ప్రధాని పదవి నుంచి తప్పుకున్నాక... ఉచిత నివాస సదుపాయం కల్పిస్తారు. ఉచితంగా విద్యుత్, నీరు వంటి సదుపాయాలు అందిస్తారు. ప్రధాని పదవి నుంచి వైదొలిగాక ఐదేళ్ల పాటు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) భద్రత కల్పిస్తారు.

# సీఏఏపై అమెరికా ప్రకటన.. తీవ్రంగా తప్పుబట్టిన భారత్

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) విషయంలో అగ్రరాజ్యం అమెరికా ప్రకటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ విషయం భారత అంతర్గత విషయమని స్పష్టం చేసింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ మాట్లాడుతూ.. 2019కు చెందిన పౌరసత్వ సవరణ చట్టం దేశానికి సంబంధించిన అంతర్గత విషషమని, ఇది దేశ సమగ్ర సంప్రదాయాలకు, మానవ హక్కుల విషయంలో తమ దీర్ఘకాల నిబద్ధతకు అనుగుణంగా రూపొందించినట్లు వెల్లడించారు. అఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లో హింసకు గురై 2014 వరకు భారత్‌కు వలస వచ్చిన హిందూ, సిక్కు, జైన, బౌద్ధ, పార్సీ, క్రైస్తవ వర్గాలకు చెందిన మైనారిటీలకు భారత పౌరసత్వం, భద్రత కల్పించే ఉద్దేశ్యంతో ఈ చట్టం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ చట్టం ఏ పౌరుడి హక్కులను తొలగించదని అన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. పౌరసత్వ సవరణ చట్టం పౌరసత్వం ఇవ్వడం.. పౌరసత్వం తీసివేయడం గురించి కాదని అన్నారు. ఇది అందరికీ అర్థం కావాలన్నారు. 'ఇది ఏ దేశపు జాతీయత లేని వ్యక్తి సమస్యను పరిష్కరిస్తుంది. మానవ హక్కులకు మద్దతు ఇస్తుంది. మానవ గౌరవాన్ని అందిస్తుంది' అని పేర్కొన్నారు. కాగా పౌరసత్వ సవరణ చట్టంపై అమెరికా స్పందించిన విషయం తెలిసిందే.






సీఏఏ అమలులు తీరును తాము క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని ఆ దేశ విదేశాంగ శాఖ తెలిపింది. మార్చి 11వ తేదీన రిలీజైన సీఏఏ నోటిఫికేషన్ పట్ల ఆందోళనగా ఉందని విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తెలిపారు. సీఏఏను ఎలా అమలు చేస్తారన్న విషయాన్ని గమనిస్తున్నామని, ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని మతాలకు స్వేచ్ఛ ఉంటుందని మిల్లర్ తెలిపారు.

# కంపెనీలపై దాడులు.. 'అన్నీ ఊహలు..అవాస్తవాలే'

ఎలక్టోరల్ బాండ్లను కొనుగోలు చేసిన వారి పేర్లను బయటపెట్టాలనే సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఆయా వివరాలను వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం బహిర్గతం చేసింది. దాంతో భారతీయ స్టేట్ బ్యాంక్ సమర్పించిన డేటాను ప్రజలకు అందుబాటులో ఉంచింది. మొత్తం 763 పేజీలతో ఎలక్షన్ కమిషన్ వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేసింది. అయితే ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేసిన కొన్ని సంస్థలపై గతంలో సీబీఐ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేశాయని పలువురు గుర్తు చేస్తున్నారు. రాజకీయ పార్టీలకు అత్యధిక విరాళాలిచ్చిన టాప్ 30 కంపెనీల్లో 15 కంపెనీలకుపైగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ (ఐటీ)వంటి సంస్థల దర్యాప్తు ఎదుర్కొన్నవే కావడం గమనార్హం.

ఈ వ్యవహారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ప్రముఖ మీడియా సంస్థతో జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. విరాళాలకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల దాడులకు సంబంధం ఉందంటూ జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదన్నారు. ఈడీ కంపెనీలపై రైడ్ చేస్తేనే ఆత్మరక్షణ కోసం ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశారనుకోవడం ఊహాగానమే అవుతుందన్నారు. బాండ్లు కొనుగోలు చేసిన తర్వాత కూడా ఆయా సంస్థలపై దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఆ విరాళాలు మొత్తం భాజపాకే వెళ్లాయని చాలా మంది భావిస్తున్నారని, కొన్ని ప్రాంతీయ పార్టీలకు కూడా జమైనట్లు తెలిపారు.



ఎన్నికల బాండ్లకు సంబంధించి సమగ్ర సమాచారంతో పూర్తి వివరాలు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించించింది కదా అని ప్రస్తావించగా ప్రస్తుతం ఆ అంశం కోర్టు పరిధిలో ఉందన్నారు. తనకంటే ముందు ఆర్థిక మంత్రిగా పనిచేసిన అరుణ్‌జైట్లీ మునుపటి కంటే మెరుగైనదిగా భావించి ఈ ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌ను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు కొనుగోలు చేసిన బాండ్లు నేరుగా రాజకీయ పార్టీల ఖాతాల్లోనే పడుతున్నాయన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి ముందుకెళ్లాలన్నారు. ఎలక్షన్ కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎన్నికల బాండ్ల విరాళాల్లో ఎక్కువ మొత్తం బీజేపీకి వెళ్లగా ఆ తర్వాతి స్థానాల్లో తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర పార్టీలున్నాయి.

## అది మా అంతర్గత వ్యవహారం.. మీ జోక్యం వద్దు..



పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై అమెరికా చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. సీఏఏ అనేది భారతదేశ అంతర్గత వ్యవహారమని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. పౌరసత్వ సవరణ చట్టం నోటిఫికేషన్ గురించి ఆందోళన చెందుతున్నామని మార్చి 11న అమెరికా విదేశాంగ శాఖ ప్రకటన చేసింది. ఈ చట్టం అమలు తీరును తాము నిశితంగా పరిశీలిస్తున్నామని, మతపరమైన స్వేచ్ఛను గౌరవించడం, అన్ని వర్గాలు చట్టం ప్రకారం సమానమేనని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ అన్నారు. దీనిని సీరియస్ గా తీసుకున్న భారత ప్రభుత్వం ఇది తమ దేశ అంతరంగిక వ్యవహారం అని జోక్యం చేసుకోవద్దని సూచించింది. అమెరికా ప్రకటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. పౌరసత్వ (సవరణ) చట్టం 2019 భారతదేశ అంతర్గత విషయమని అన్నారు. సీఏఏ పై అమెరికా చేసిన వ్యాఖ్యలు అవగాహన లేనివి అని ఘాటు రిప్లై అచిచారు. డిసెంబర్ 31, 2014 న లేదా అంతకు ముందు భారతదేశానికి వచ్చిన అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లలో హింసకు గురైన హిందూ, సిక్కు, బౌద్ధ, పార్సీ, క్రైస్తవ వర్గాలకు చెందిన మైనారిటీలకు ఈ చట్టం రక్షగా ఉంటుందని రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు.

## కేరళలో కమలం వికసిస్తుంది

కేరళ ప్రజలు అవినీతి, అసమర్థ ప్రభుత్వం వల్ల ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో కమలం వికసిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ అభ్యర్థుల కోసం నిర్వహించిన బహిరంగ ప్రచారంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఎన్నికల్లో కేరళ ప్రజలు మమ్మల్ని రెండంకెల ఓట్ల శాతం పార్టీగా మార్చారు. ఈ సారి కూడా కమలం వికసిస్తుందని, ప్రజలకు మంచి రోజులు వస్తాయని మోదీ పేర్కొన్నారు. బీజేపీ యువతను ఎంకరేజ్ చేస్తోందని, పతనంతిట్ట నుంచి బీజేపీ అభ్యర్థిగా అనిల్ కే ఆంథోనీ పోటీ చేస్తున్నారని, ప్రజలకు సేవ చేసేందుకు ఆయన ఉత్సాహంగా ఉన్నట్లు ప్రధాని తెలిపారు. కేరళ సంస్కృతిలోని ఆధ్యాత్మికత ఉంది. కానీ రాష్ట్రంలో శాంతిభద్రతలు గణనీయంగా క్షీణించాయని ఆయన అన్నారు. ఈ సమావేశానికి ఎన్‌డీఏ లోక్‌సభ అభ్యర్థులు వి మురళీధరన్ (అట్టింగల్), అనిల్ కె ఆంటోని (పతనంతిట్ట), శోభా సురేంద్రన్ (అలప్పుజా), బైజు కలసాల (మావెలిక్కర) ఇతర నేతలతో పాటు.. ఇటీవల కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన పద్మజ వేణుగోపాల్ కూడా ఉన్నారు.



## వారు జైలులో ఉండాల్సిన వారు...

పొరుగు దేశాల నుంచి ఇండియాలో శరణార్థులుగా ఉంటున్న వారు దేశ రాజధాని ఢిల్లీలో చేసిన నిరసనలపై ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరంతా జైలులో ఉండాల్సి వారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ నుంచి వచ్చిన హిందూ శరణార్థులు అక్బర్ రోడ్డులోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసనలు చేపట్టారు. రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు స్పాట్ కు చేరుకుని నిరసనకారులను అడ్డుకున్నారు. భారీగా పోలీసు బలగాలను మోహరించారు. కాగా.. సీఏఏ పై కేజ్రీవాల్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. భారతదేశంలోని ప్రజలకే ఉపాధి లేదన్న ఆయన బయటి వ్యక్తులను దేశంలో ఎందుకు రానిస్తున్నారని కేంద్రాన్ని నిలదీశారు. సీఏఏతో దేశవ్యాప్తంగా ఆందోళనలు మొదలయ్యాయి. తాము భారత పౌరసత్వం తీసుకున్నందున భారతదేశ ప్రజలమేనని, తీవ్రవాదులు అనే ముద్ర వేయడం ఎంత వరకు సమంజసం అని నిరసనకారులు ప్రశ్నించారు. గత 15 సంవత్సరాలుగా ఢిల్లీలో నివసిస్తున్నామన్నారు. ఈ ఇబ్బందులు చూడలేక ప్రధాన మంత్రి మోదీ ప్రభుత్వం తమకు పౌరసత్వం ఇచ్చేలా చర్యలు తీసుకున్నారని ఆందోళనకారులు చెప్పుకొచ్చారు.



మరోవైపు.. నిరసనల తర్వాత ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోషల్ మీడియాలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "ఈ పాకిస్థానీల ధైర్యం? మొట్టమొదట మన దేశంలోకి అక్రమంగా చొరబడి, మన దేశంలోని చట్టాలను ఉల్లంఘించారు. జైల్లో ఉండాల్సిన వారు నిరసనలు చేసి అలజడులు సృష్టిస్తున్నారు. సీఏఏ వచ్చాక పాకిస్థానీలు, బంగ్లాదేశీయులు దేశమంతటా వ్యాపించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తారు. వారిని తన ఓటు బ్యాంకుగా మార్చుకోవాలనే ఉద్దేశంతో బీజేపీ దేశం మొత్తాన్ని ఇబ్బందుల్లోకి నెడుతోంది". అని కేజ్రీవాల్ ఫైర్ అయ్యారు.

## నేడు ఎన్నిక షెడ్యూల్ ప్రకటన

**ఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదల ఎప్పుడనే దానిపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా స్పందించింది. నేడు శనివారం(16 మార్చి) మధ్యాహ్నం మూడు గంటలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తామని.. ఈ మేరకు ప్రెస్‌మీట్ ఉంటుందని ఈసీఐ ప్రతినిధి ట్వీట్ ద్వారా తెలియజేశారు. లోక్‌సభతో పాటు ఆంధ్రప్రదేశ్, సిక్కిం, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు ఏకకాలంలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను రేపు ఈసీ అధికారికంగా వెల్లడించనుంది.




**ఈసీలతో సీఈసీ భేటీ**

కేంద్ర ఎన్నికల సంఘంలో.. ఇద్దరు సభ్యుల కొరత ఏర్పడిన సంగతి తెలిసిందే. దీంతో షెడ్యూల్ ప్రకటన జాప్యం అవుతుందేమోనని అంతా భావించారు. ఈ నేపథ్యంలో.. గురువారం ప్రధాని నేతృత్వంలోని హైపవర్డ్ కమిటీ ఈసీ సభ్యుల ఎంపిక కోసం భేటీ అయ్యింది. తదనంతరం.. రెండు పేర్లను రాష్ట్రపతికి పంపగా.. వెంటనే ఆమోద ముద్ర లభించింది. అలా.. ఎన్నికల సంఘానికి నిన్న ఇద్దరు నూతన ఎన్నికల కమిషనర్ల నియామకం ఆఘమేఘాల మీద జరిగింది.

శుక్రవారం ఉదయం ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ సమక్షంలో జ్ఞానేష్ కుమార్, డాక్టర్ సుఖ్ బీర్ సింగ్ సంధు ఎన్నికల కమిషనర్లుగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం కీలక భేటీ జరిగింది. ఈ భేటీలోనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తేదీపై నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది.

# లిక్కర్ స్కాంలో కవిత అరెస్ట్

-మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాది సోమ భరత్ కుమార్ ప్రశ్నించారు. సుప్రీంకోర్టులో కవిత కేసు పెండింగ్‌లో ఉంది. కేసు పెండింగ్‌లో ఉండగా ఈడీ అధికారులు కవిత ఇంటికి ఎలా వస్తారు?. ఢిల్లీ నుంచి ఈడి అధికారులు ఇలా రావడం కరెక్ట్ కాదు. ఎలాంటి చర్యలు తీసుకోమని కోర్టులో ఈడీ చెప్పింది. ఈనెల 19న సుప్రీంకోర్టులో కవిత కేసు విచారణ ఉందని తెలిపారు.

### ఛార్జ్‌షీట్‌లో కవితపై మోపిన అభియోగాలు ఏంటంటే.?

ఆప్ నేతలకు సౌత్‌గ్రూపు రూ.100 కోట్లు హవాలా రూపంలో ముడుపులిచ్చింది. తద్వారా మద్యం విధానం తమకు అనుకూలంగా ఉండేలా చూసుకుంది. అరుణ్‌పిళ్లైకి క్రియేటివ్ డెవలపర్స్ భాగస్వాములు, రవిశంకర్ చెట్టి రూ.5 కోట్లకు హైదరాబాద్‌లో భూమి అమ్మారన్న ఆరోపణలున్నా వారెవరూ అరుణ్‌పిళ్లైను కలవలేదు. ఈ ఒప్పందాన్ని ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ గ్రూప్‌నకు చెందిన శ్రీహరి చర్చలు జరిపి ఖరారు చేశారు. భూమి కొనుగోలు నిమిత్తం సంస్థకు ఒకరు డబ్బులు బదిలీ చేస్తారని చెప్పిన శ్రీహరి.. ఎవరు డబ్బులు బదిలీ చేశారనేది రవిశంకర్ చెట్టికి చెప్పలేదు. అయితే, ఎన్‌గ్రోత్ కాపిటల్ పేరుతో ఫీనిక్స్ గ్రూపునకు చెందిన శ్రీహరి ఆ భూమిని కొనుగోలు చేసినట్లు బుచ్చిబాబు తన వాంగ్మూలంలో చెప్పారు. ఆ సమయంలో ఫీనిక్స్ గ్రూపునకు సీవోవోగా శ్రీహరి ఉన్నారు. దీంట్లో కవిత భర్త అనిల్‌కుమార్ కూడా భాగస్వామి. కవిత తెలంగాణలో పెద్ద రాజకీయ నాయకురాలు కావడంతో మార్కెట్ రేటు కంటే తక్కువకే భూమి కొనుగోలు చేశారు. దీంతోపాటు కవిత మరో ప్రాపర్టీ కూడా కొనుగోలు చేశారు. 25వేల చదరపు అడుగుల ప్రాపర్టీకి సంబంధించిన పేపర్ వర్క్‌ను బుచ్చిబాబు, శ్రీహరి పూర్తిచేశారు. మార్కెట్ ధర చదరపు అడుగు రూ.1,760 ఉంటే రూ.1,260 మాత్రమే చెల్లించారు. కవితతో గణనీయమైన ఆర్థిక లావాదేవీలున్న వ్యక్తి రవిశంకర్‌తో భూమి కొనుగోలుకు చర్చలు జరిపినట్లు నిర్ధారణకు వచ్చాం. ఇండోస్పిరిట్స్‌లో కవిత తరపున అరుణ్ పిళ్లై ప్రతినిధిగా వ్యవహరించి రూ.32.86 కోట్లు అందుకున్నారు. పిళ్లై సూచన మేరకు రూ.25.5 కోట్లు నేరుగా ఇండోస్పిరిట్స్ నుంచి పిళ్లై ఖాతాకు బదిలీ అయ్యాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో మద్యం దుకాణం నిమిత్తం ఎన్‌వోసీ కోసం



జీఎంఆర్ గ్రూపునకు చెందిన బీవీ నాగేశ్వరరావుతో మాగుంట రాఘవ, ఎంపీ ఎంస్ రెడ్డి చర్చలు జరిపారు. ఎంఎస్ రెడ్డి వాట్సాప్ సందేశాల ద్వారా ఇది వెల్లడైంది. వ్యాపారంలో భాగస్వాములై ఎన్‌వోసీ ఇవ్వాలని జీఎంఆర్‌ను కోరినట్లు తేలింది. ఇండోస్పిరిట్స్‌లో అరుణ్ పిళ్లై ప్రాక్సీ భాగస్వామి. ఇండోస్పిరిట్స్ నుంచి లాభాలు తన నుంచి కవితకు చేరడంపై అరుణ్‌పిళ్లై సేట్‌మెంట్ల ద్వారా వెల్లడైంది. ఏప్రిల్ 2022లో ఢిల్లీలోని ఓ హోటల్లో విజయ్‌నాయర్‌తో కవిత, అరుణ్‌పిళ్లై సమావేశమయ్యారు. వ్యాపార కార్యకలాపాలు కుంటుపడుతున్న నేపథ్యంలో చెల్లించాల్సిన లంచాలు రికవరీ చేయడంపై చర్చించారు. హోటల్ రికార్డుల దీన్ని ధ్రువీకరించుకున్నాం. దినేష్ ఆరోరా, అరుణ్‌పిళ్లై వాంగ్మూలాలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయి. కిక్‌బ్యాక్‌ల రూపంలో సొమ్ములు వెనక్కి మళ్లించే పనులను అభిషేక్ బోయినపల్లి, అరుణ్ పిళ్లై నిర్వహించినట్లు ఆడిటర్ బుచ్చిబాబు వాంగ్మూలమిచ్చారు. సౌత్‌గ్రూప్ నుంచి కిక్‌బ్యాక్‌లను విజయనాయర్ అందుకుంటున్నారన్నారు. విజయ్‌నాయర్‌కు డబ్బు అవసరమని బుచ్చిబాబు ఫోను నంబర్ల ద్వారా చేసిన వాట్సాప్ సందేశాల ద్వారా ధ్రువీకరణ అయింది. దీంట్లో 'వీ'కి డబ్బు కావాలి అంటే విజయ్‌నాయర్‌కు డబ్బు అవసరమని అర్థమని బుచ్చిబాబు తెలిపారు. ఢిల్లీ, హైదరాబాద్ హోటళ్లలో జరిగిన సమావేశాల్లో సౌత్‌గ్రూపు నుంచి విజయ్‌నాయర్‌కు డబ్బులు పంపడంపై ప్రధానంగా చర్చ జరిగినట్లు కూడా బుచ్చిబాబు తెలిపారు. క్రియేటివ్ డెవలపర్స్ ఖాతాకు డబ్బు మళ్లించడం కూడా బుచ్చిబాబు నోట్స్ ద్వారా తెలిసింది. కవిత తరఫున ఇండోస్పిరిట్స్ నుంచి వచ్చిన లాభాలను అరుణ్ పిళ్లై అందుకొని ఆమె ఆదేశాల మేరకు పెట్టుబడులు పెట్టాల్సి ఉందని ధ్రువీకరణ అయింది.

భూముల కొనుగోలులో శ్రీహరి సూచనల మేరకు కవిత తరపున సొమ్ములు బదిలీ చేయడం వరకే పిళ్లై పాత్ర పరిమితమని తేలింది. అయితే, మే 2022 నుంచి రిజిస్టర్ కాకుండా ఉన్న భూమి 11.10.22న అరుణ్‌పిళ్లై భార్య పేరు మీద రిజిస్టర్ కావడం అరుణ్‌పిళ్లై ప్రయోజనం కోసమేనని, కవితకు లాభదాయకం కాదని దర్యాప్తులో తేలింది. అరుణ్‌పిళ్లై ఆదేశాల మేరకే ఇండో స్పిరిట్స్ నుంచి ఆంధ్రప్రభ పబ్లికేషన్స్, ఇండియా అహెడ్‌లకు రూ.కోటి, రూ.70 లక్షలు బదిలీ చేసినట్లు సమీర్ మహేంద్రు తెలిపారు. దీనికి మద్దతుగా ఎలాంటి రికార్డు లేదు. అయితే, అరుణ్ పిళ్లై చెప్పినట్లుగా ఈ సంస్థలు ఇండో స్పిరిట్స్ లేదా అరుణ్ పిళ్లైకి ఎలాంటి ఈవెంట్ నిర్వహించలేదు. ఆయా సంస్థలకు ఇచ్చిన సొమ్ము ఇప్పటివరకూ వెనక్కి ఇవ్వలేదు. గౌతమ్ ముత్తాకు అరుణ్‌పిళ్లై బదిలీ చేసిన రూ.4.76 కోట్లు, అభిషేక్‌కు రూ.3.85 కోట్లు బదిలీ రుణం తిరిగి ఇవ్వమని చెప్పినప్పటికీ కాలక్రమేణా ఎలాంటి రుణం లేదని పిళ్లై పేర్కొన్నారు.

### కవిత ఇంటి ముందు గేటు బయట బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా

ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను అరెస్ట్ చేసే దిశగా %జుణ% అడుగులు వేస్తోంది. ఇప్పటికే కవితను అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు.. ఆమెకు అరెస్ట్ వారంట్‌తో పాటు సెర్చ్ వారెంట్ ఇచ్చారు. దీనికి సంబంధించి కవితతో పాటు ఆమె కుటుంబ సభ్యులకు నోటీసులిచ్చినట్టు తెలిసింది.

### లాయర్లు, కవిత వర్గం ఏమంటోంది?

ఒక మహిళను సాయంత్రం 6గంటలకు అరెస్ట్ చేయరాదు సుప్రీంకోర్టుకు ఇచ్చిన మెమోను ఈడీ ఉల్లంఘించారు సెక్షన్ 41ఏ కింద నోటీసులు ఇవ్వడం సబబు కాదు,
2022 డిసెంబరులో అప్పటి విచారణ అధికారి ఇదే తరహా నోటీసు సెక్షన్ 160 కింద ఇచ్చారు, గతంలో జారీ చేసిన సెక్షన్ 160 నోటీసుకు ప్రస్తుత సెక్షన్ 41ఏ నోటీసు పూర్తి విరుద్ధంగా ఉంది. సెక్షన్ 41ఏ కింద ఎందుకు, ఏ పరిస్థితుల్లో నోటీసులు ఇచ్చారో స్పష్టత లేదు దర్యాప్తు సంస్థకు ఏవైనా ప్రశ్నలకు సమాధానం లేదా సమాచారం కావాలంటే వర్చువల్ పద్ధతిలో ఇస్తారు పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అరెస్ట్ చేయడం రాజకీయ కక్షే

# కాంగ్రెస్ ప్రభుత్వానికి నేటితో 100 రోజులు

-మొదటి పేజి తరువాయి

హామీలను ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఇంకా ఎనిమిది హామీలు పెండింగ్‌లో ఉండగా, ప్రస్తుతం తీవ్రమవుతున్న తాగునీరు, విద్యుత్ సమస్యలను కూడా ప్రభుత్వం అధిగమించాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు వంద రోజుల్లో తాను సాధించిన విజయాలను వివరిస్తూ ప్రభుత్వం గురువారం ప్రగతి నివేదిక విడుదల చేసింది.

### ఎన్నికల తర్వాతే మిగతా హామీల అమలు?

అధికారంలోకి వచ్చిన రెండోరోజే డిసెంబర్ 9న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు పథకాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఆ తర్వాత 50 రోజులకు పైగా సమయం తీసుకుని ఫిబ్రవరి 28న మరో రెండు పథకాలు షురూ చేసింది. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించింది. అనంతరం 12 రోజుల సమయం తీసుకుని మార్చి 11న ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పార్లమెంటు ఎన్నికల కోడ్‌కు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించడంతో, ఆరు గ్యారంటీల్లో అమలు కాకుండా మిగిలిన 8 హామీల అమలు లోక్‌సభ ఎన్నికల తర్వాతేనని అర్థమవుతోంది.

### వ్యతిరేకత రాలేదేమో కానీ..

వంద రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు విషయమై ప్రజల్లో వ్యతిరేకత లేకపోయినా ఒకింత అసంతృప్తి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలకు ముందు అందరికీ పథకాలు అందజేస్తామని చెప్పి.. ఇప్పుడు తెల్ల రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు పేరుతో లబ్ధిదారుల సంఖ్యలో కోత విధించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ జరుగుతోంది. ఇప్పటివరకు ఎలాంటి లబ్ధీ పొందనివారు, భవిష్యత్తులో ప్రారంభించే పథకాల్లోనైనా తమకు లబ్ధి కలుగుతుందో లేదోననే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే సంక్షేమ పథకాల అమలుకు ఏదో ఒక కొలబద్ధ ఉండాలి కదా... అందుకే తెల్ల రేషన్‌కార్డు నిబంధన అమలు చేస్తున్నామంటూ ప్రభుత్వం వివరణ ఇవ్వడం గమనార్హం.

### ఒక్క మహాలక్ష్మికే రూ.40 వేల కోట్లకు పైగా

రాష్ట్రంలోని ప్రతి మహిళకు నెలకు రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో ప్రకటించింది. మహాలక్ష్మి పేరుతో రూపొందించిన తొలి గ్యారంటీలోని మొదటి అంశం ఇదే. ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్రంలో 1.65 కోట్ల మంది మహిళలున్నారు. వీరిలో పింఛన్లు పొందుతున్న 26 లక్షల మంది పోను మిగిలిన వారికి నెలకు రూ.2,500 చొప్పున ఇవ్వాలంటే ఏటా రూ.41,700 కోట్లు కావాల్సి ఉంటుంది.

### వరికి బోనస్ వచ్చే సీజన్ నుంచా?

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మరో ప్రధాన గ్యారంటీ రైతు భరోసా. రైతులకు, కౌలు రైతులకు ఏటా రూ.15 వేల పెట్టుబడి సాయం, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలతో పాటు క్వింటాలు వరికి రూ.500 బోనస్ ఇందులోని ప్రధాన హామీలు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేసినా క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వలేదు. అయితే వచ్చే వర్షాకాలం సీజన్ నుంచి దీనిని అమలు చేయవచ్చని తెలుస్తోంది. రైతు భరోసా అమలు చేయాలంటే ఏటా కనీసం రూ.34 వేల కోట్లు కావాల్సి ఉంటుంది.

### చేయూత.. ఎప్పుడో?

రాష్ట్రంలోని పేదలు అత్యంత ఆతురతతో ఎదురుచూస్తున్న మరో గ్యారంటీ చేయూత. ఈ గ్యారంటీ కింద రాష్ట్రంలోని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పింఛన్లను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచాల్సి ఉంది. దీని కోసం 46 లక్షలకు మందికి పైగా పేదలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. కాగా చేయూత పథకాన్ని అమలు చేయాలంటే ఏటా రూ.18 వేల కోట్లకు పైగా ఖర్చు పెట్టాల్సి రానుంది.

### యువ వికాసం... గందరగోళం

యువ వికాసం గ్యారంటీలో భాగంగా ఇంటర్ నుంచి వృత్తి విద్యా కోర్సుల వరకు అన్ని స్థాయిల్లోని విద్యార్థులకు ఫీజుల నిమిత్తం రూ.5 లక్షల విలువైన విద్యాభరోసా కార్డులు ఇస్తామని ప్రకటించారు. కానీ ఆ కార్డు ఎలా ఇస్తారు? ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందా? వడ్డీ ఎవరు భరిస్తారు? లాంటి వాటిపై ఇప్పటికీ స్పష్టత లేదు.

### ఇప్పటివరకు ఇవీ..

ఆరు గ్యారంటీల్లో భాగంగా తొలుత ప్రారంభించింది ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి. ఈ పథకం ప్రారంభించే నాటికి ఆర్టీసీ బస్సుల్లో సగటు ఆక్యుపెన్సీ రేషియో 66 శాతం మాత్రమే. కానీ పథకం ప్రారంభమయ్యాక అది క్రమంగా వంద శాతానికి చేరుకుంది. ఇప్పటివరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించిన మహిళల సంఖ్య 25 కోట్లను మించిపోయింది. ఈ సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ఇక గృహజ్యోతి కింద తొలి నెలలో లబ్ధి పొందిన వారి సంఖ్య తక్కువగానే ఉంది. రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తున్న గృహ కనెక్షన్ల సంఖ్య 95.23 లక్షలు కాగా, తెల్ల రేషన్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తుల పేరుతో లబ్ధిదారుల సంఖ్య సగానికి పైగానే తగ్గిందని తెలుస్తోంది. మరోవైపు ఇందిరమ్మ పథకం కింద రాష్ట్రంలోని 20 లక్షల మందికి ఇళ్ల సౌకర్యం కల్పించాలన్నది లక్ష్యం కాగా, ప్రస్తుతం సొంత స్థలం ఉన్న వారికి రూ.5 లక్షల నగదు సాయం పథకాన్ని ప్రారంభించారు. అలాగే రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం కూడా ప్రారంభమైంది.

### దరఖాస్తు చేసుకోని వారి పరిస్థితేమిటి?

ప్రజాపాలన కార్యక్రమంలో సంక్షేమ పథకాల కోసం 1.25 కోట్ల దరఖాస్తులు వచ్చాయి. అయితే ఇందులో డూప్లికేషన్లు, ఇప్పటికే లబ్ధి పొందిన దరఖాస్తులు కూడా ఉన్నాయని ప్రభుత్వం చెపుతోంది. ఇదిలావుంటే అసలు చాలా మంది ప్రజలు ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోలేదు. దీంతో తెల్ల రేషన్‌కార్డు ఉన్నప్పటికీ పథకాల లబ్ధి పొందలేకపోవడం గమనార్హం. ప్రతి నాలుగు నెలలకోసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వం చెపుతోంది. ఈ లెక్కన ఏప్రిల్ నెలాఖరులో మరోమారు ప్రజాపాలన నిర్వహించాల్సి ఉంది. ఇప్పటికే ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరు గ్యారంటీల అమలుపై విమర్శలు గుప్పిస్తున్నాయి. 100 రోజుల్లో అమలు సాధ్యం కాదని తెలిసీ ఎందుకు గ్యారంటీ ఇచ్చారని ప్రశ్నిస్తున్నాయి. వంద రోజులు పూర్తయిన తర్వాత పోరాట కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరిస్తున్నాయి.

# మల్కాజిగిరిలో ప్రధాని మోదీ రోడ్‌షో

-మొదటి పేజి తరువాయి

ఆయన పాల్గొన్నారు. మల్కాజిగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన రోడ్‌షోకి భారీ ఎత్తున అభిమానులు తరలివచ్చారు. ప్రధాని మోదీ రోడ్ షో మీర్జాలగూడ చౌరస్తా నుంచి ప్రారంభమైంది. సుమారు 1.3 కి.మీ. దూరంలో ఉన్న మల్కాజిగిరి చౌరస్తా వరకు రోడ్‌షో జరుగుతుంది. దారి పొడవునా సుమారు 60 స్వాగత వేదికలు ఏర్పాటు చేశారు.
ప్రధానమంత్రి నరేంద్రమోదీ రెండు రోజుల(నేడు, రేపు) నగర పర్యటన దృష్ట్యా భద్రతను కట్టుదిట్టం చేశారు. మోదీ విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోనున్న నేపథ్యంలో దానిని కేంద్ర బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఎయిర్‌పోర్ట్ పరిసరాలను అణువణువూ జాగిలాలతో జల్లెడ పట్టాయి. నేడు మోదీ రోడ్ షో పూర్తిచేసుకుని తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. శనివారం ఉదయం 10.40 నుంచి 11.15 మధ్య రాజ్‌భవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు.
రోడ్ షో కు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఆ ప్రాంతమంతా భారత్ మాతాకీ జై నినాదాలతో మారుమోగుతోంది. ఔర్ ఏక్ బార్ మోదీ సర్కార్ అంటూ బీజేపీ శ్రేణులు నినదిస్తున్నారు. మోదీ రోడ్ షో సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. రోడ్ షో తర్వాత రాజ్ భవన్ కు చేరుకుంటారు. ఈ రాత్రికి ఆయన రాజ్ భవన్ లోనే బస చేస్తారు.



## పక్కా ప్లాన్‌తోనే కవిత అరెస్ట్



-మొదటి పేజి తరువాయి

దాడి చేయించి అరెస్టు జేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక నేతలను అరెస్టు చేసిన సమయంలో కవితను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఎన్నికల ముందు మోదీ, అమిత్ షా రైడ్స్, మ్యాచ్ ఫిక్స్ చేస్తున్నారని అన్నారు. మోదీ, కేడీ గల్లీలో కొట్లాడుకుంటారని ఢిల్లీలో దోస్తులవుతారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్షల కోట్లకు పడగెత్తిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతున్నారని తాము ప్రశ్నిస్తే ఇన్నాళ్లు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఇక తెలంగాణలో ఉండదని.. బీజేపీ రెండు ఎంపీ సీట్లను కూడా రాష్ట్రంలో గెలవదని అన్నారు. నల్లధనాన్ని పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని మోదీ చెప్పారని ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. ప్రతీ ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. కుల, మత ఘర్షణల పేరుతో మళ్లీ మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో తమకు 14 నుంచి 15 ఎంపీ సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ అని.. సెక్యులర్ పార్టీనే అందరినీ సమానంగా పాలిస్తుందని చెప్పారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వేల కోట్లు ఖర్చు పెట్టి గెలవాలని చూసినా.. ప్రజలు తమను గెలిపించారని చెప్పారు. ఇండియా కూటమిలో రాహుల్ గాంధీనే ప్రధాని అవుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

## కాంగ్రెస్ వచ్చింది కరువు తెచ్చింది హరీష్‌రావు సెటైర్లు..




కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కరువు తెచ్చిందని ఎద్దేవా చేశారు మాజీ మంత్రి హరీష్ రావు. ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ఏ ముఖం పెట్టుకుని ఎన్నికల్లో ఓటు అడుగుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, హరీష్‌రావు శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అయ్యింది. ఆరు గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేస్తామని విఫలమయ్యారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ మాట తప్పింది. అసెంబ్లీ రూపురేఖలు మారుస్తామని తట్ట మట్టి కూడా ఎత్తలేదు. రైతు రుణమాఫీపై అతీగతీ లేదు. ఆసరా పెన్షన్లు పెంచుతామన్నారు. ఉన్న పెన్షన్లు కూడా ఇవ్వడం లేదు. రాష్ట్రంలో కరువును పెంచడానికి కాంగ్రెస్ పోటీ పడుతోంది. వ్యవసాయాన్ని శిథిలావస్థకు చేర్చుతున్నారు. సీఎం గారు పార్టీ గేట్లు ఎత్తడం కాదు.. ప్రాజెక్టుల గేట్లు ఎత్తండి. వ్యవసాయానికి నీళ్ళు ఇవ్వండి. తాగడానికి నీళ్ళు లేక జనం గోస గోస పడుతున్నారు మీ పాలన వచ్చింది ఖాళీ బిందెలు, నిండుగా వాటర్ ట్యాంకర్లు దర్శనమిస్తున్నాయి. కర్ణాటక నుంచి తాగునీరైన తెప్పించడంలో విఫమయ్యారు. ప్రాజెక్టులు అ?ప్పగింత చేసి మేము ఒత్తిడి తేవడంతో మళ్లీ వెనక్కి తగ్గారు. కేసీఆర్.. కిట్లు ఇస్తు.. రేవంత్ మాత్రం తిట్లతో పోటీ పడుతున్నారు. రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతా అంటున్నారు. ఇదీ కాంగ్రెస్ ఘనత. కరువును పెంచడానికి పోటీ పడుతుంది కాంగ్రెస్. కాంగ్రెస్ వంద రోజుల పాలన లో 174మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. 34మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారు. 2500 రూపాయలు మహిళలకు ఇస్తాం అన్నారు. ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని మొన్నటి బడే భాయ్ చోటే భాయ్ మీటింగ్‌లో తేలిపోయింది. కాంగ్రెస్ పాలన, యూట్యూబ్.. యూటర్న్ పాలనగా సాగుతోంది అంటూ తీవ్ర విమర్శలు చేశారు.

## కవితపై కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం మాకు లేదు

-మొదటి పేజి తరువాయి



సూచించారు. ఈడీ విచారణకు కవిత సహకరించాలని సూచించారు. ఇన్నాళ్లు విచారణకు సహకరించకుండా కవిత తప్పించుకుని తిరిగారని అన్నారు. సహకరించలేదు కాబట్టే.. ఈడీనే ఆమె ఇంటికి వెళ్లి అరెస్ట్ చేసిందని తెలిపారు. కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం బీజేపీకి లేదన్నారు. విచారణ సంస్థలు తమ పని తాము చేసుకుని పోతాయని కిషన్‌రెడ్డి అన్నారు. ఇన్నాళ్లూ ఈడీ విచారణకు సహకరించకుండా ఆమె తప్పించుకున్నారని ఆరోపించారు. ఆమె సహకరించనందునే ఈడీ నేరుగా ఆమె ఇంటికి వెళ్లిందన్నారు. ఈడీ స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ అని గుర్తు చేశారు. ఎవరి పైనా కక్ష సాధింపు చర్యలకు దిగాల్సిన అవసరం తమకు లేదన్నారు. విచారణ సంస్థలు తమ పని తాము చేసుకొని పోతాయన్నారు. కవితపై కక్ష సాధింపులకు దిగాల్సిన అవసరం బీజేపీ కి లేదని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఈడీ విచారణకు ఆమె సహకరించాలని కోరారు. ఈడీ అధికారులు వారి పని వారు చేసుకుని పోతారని చెప్పారు. దేశంలో విచారణలు మెదటసారి జరగటం లేదన్నారు. ఈడీ దగ్గరున్న ఆధారాలను బట్టి విచారణలు జరుపుతారని ఈటల రాజేందర్ అన్నారు.

## లిక్కర్ కేసులో కవిత అరెస్ట్.. నేతల రియాక్షన్

**హైదరాబాద్:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో సంచలనం చోటుచేసుకుంది. కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అదుపులోకి తీసుకుంది. హైదరాబాద్‌లోని కవిత నివాసంలో శుక్రవారం ఈడీ సోదాలు నిర్వహించింది. నాలుగు గంటలపాటు సోదాలు జరిపిన అనంతరం కవితను అరెస్ట్ చేసింది ఈడీ.

### కావాలనే శుక్రవారం వచ్చారు

అరెస్టు చేయమంటూ సుప్రీంకోర్టుకు మాట ఇచ్చి.. ఇప్పుడు ఎలా అరెస్టు చేస్తారని మండిపడ్డారు. సుప్రీం చెప్పిన మాటను పక్కన పెట్టిన తమ అధికారులు (ఈడీ).. కోర్టు ద్వారా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈడీ అధికారులు కవిత ఇంటికి కావాలని శుక్రవారం వచ్చారని ఆరోపించారు. సోదాలు ముగిసిన తర్వాత కూడా ఇంట్లోకి రావద్దు అంటూ హుకుం జారీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఈడీ అధికారులకు పూర్తిగా సహకరిస్తామని కవిత, కుటుంబ సభ్యులు, పార్టీ లీడర్లు తెలిపారు. దర్యాప్తు సంస్థ అక్రమ రెస్టును న్యాయపరంగా శాంతియుతంగా ప్రజాస్వామ్యుతంగా ఎదుర్కొంటామని పేర్కొన్నారు.

## సంపాదకీయం

# బెంగళూరులో నీటి సంక్షోభం

బోర్లు అడుగంటాయి. చెరువులు ఎండిపోయాయి. నదులు పిల్ల కాలువలను తలపిస్తు న్నాయి. ఇప్పట్లో వర్షాలు కురిసే అవకాశం లేదు. ఉన్న భూగర్భ జలాలు రోజురోజుకు పడిపోతున్నాయి. ఇలాంటి సమయంలో అక్కడి ప్రభుత్వానికి ఏం చేయాలో అర్థం కావడం లేదు. తెరపైకి అనేక నిబంధనలు తీసుకొచ్చింది. వాటర్ సర్వీసింగ్ సెంటర్లను మూసివేసింది. నీళ్లను అడ్డగోలుగా వాడితే జరిమానా విధిస్తామని హెచ్చరించింది. అయినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. తాగే నీటికి కటకట.. స్నానం వారానికి ఒక్కసారే.. ఇది ప్రస్తుతం దేశ ఐటీ రాజధాని బెంగళూరులో నెలకొన్న పరిస్థితి.మార్చి నెలలోనే బెంగళూరు వాసులు నీళ్ల కోసం ఆర్తనాదాలు పెడుతున్నారంటే.. ఇక ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బోర్లు ఎండిపోవడంతో బెంగళూరులో నీటి సంక్షోభం తీవ్ర రూపు దాల్చింది. స్థానికులు అవసరాల కోసం ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఇదే సమయంలో ట్యాంకర్ నిర్వాహకులు అడ్డగోలుగా చార్జీలు వసూలు చేస్తున్నారు. గతంలో ఒక ట్యాంకర్ 600 నుంచి 1000 వరకు లభ్యమయ్యేది. కానీ ఇప్పుడు ఆ ధర ఏకంగా రెండు వేలకు పెరిగిందంటే అక్కడ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ధరలు తగ్గించాలని హెచ్చరించడంతో ట్యాంకర్ నిర్వాహకులు నగరానికి రావడమే మానేశారు. దీంతో ప్రజలు అవసరాల కోసం ఆర్.ఓ ప్లాంట్ల మీద ఆధారపడుతున్నారు. అక్కడ కూడా ఒక్కొక్కరికి ఒక్కో క్యాన్ మాత్రమే ఇస్తున్నారు. ప్లాంట్ల వద్ద భారీగా క్యూ ఉండటంతో, నీటి కోసమే గంటలపాటు నిలబడాల్సి వస్తోందని బెంగళూరు నగరవాసులు అంటున్నారు. స్నానం చేయడానికి, వంట చేసుకోవడానికి తగినంత నీరు కూడా లభించడం లేదని వారు వాపోతున్నారు. వంట చేసుకోవడానికి కార్పొరేషన్ నీటిని కాచి, వడపోసి వినియోగిస్తున్నామని చెబుతున్నారు.. గత మూడు నెలలుగా తాము ఈ ఇబ్బంది పడుతున్నామని.. బెంగళూరు నీటి సరఫరా, సీవరేజ్ బోర్డు (బీఎం డబ్ల్యూ ఎస్ఎస్ బీ) అధికారులకు ఫోన్ చేసిన పట్టించుకోవడంలేదని అంటున్నారు.. నీటి కరువు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో నన్ను వైట్ ఫీల్డ్ లోని ఓ హౌసింగ్ సొసైటీ కఠిన నిర్ణయం తీసుకుంది.. నీటి వినియోగాన్ని 20% తగ్గించకుంటే 5000 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించింది.తాగునీటి కరువు నేపథ్యంలో.. ప్రైవేటు వాటర్ ట్యాంకర్లను స్వాధీనం చేసుకుంటామని ఉప ముఖ్యమంత్రి శివకుమార్ హెచ్చరించారు.. సమస్య పరిష్కారానికి అన్ని వాటర్ ట్యాంకులు తమ వివరాలను బెంగళూరు నగరపాలక కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. లలో ఐదు రోజులు మాత్రమే స్నానం.. వంట చేయడానికి కూడా నీరులేక ఆన్‌లైన్ ఆర్డర్ చేసుకుని కడుపు నింపుకుంటున్నారు. ఇక త్రాగేతర పనుల కోసం శుద్ధి చేసిన నీటిని ఎంతో పొదుపుగా వాడుకుంటున్నారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజధాని బెంగళూరు నగర ప్రజల నీటి కష్టాలు ఇవి. అక్కడి నీటి సంక్షోభం తారా స్థాయికి చేరింది. గుక్కెడు తాగు నీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల బోర్లు ఎండిపోవడంతో నగరంలో ఈ పరిస్థితి నెలకొంది. స్కూళ్లలో విద్యార్థులకు తాగడానికి కూడా నీరు దొరకని దుస్థితి ఏర్పడిందంటే.. అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. నీటి కొరత వల్ల పాఠశాలలను మూసివేసే పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పాఠశాలలు ఇప్పటికే ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నాయి. మరోవైపు నగర జలమండలి కూడా సరిపడా నీటిని సరఫరా చేయకపోవడంతో.. ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. డిమాండ్ పెరగడంలో ట్యాంకర్ల ధరలు అమాంతం పెంచేశారు.కొన్ని ప్రాంతాల్లో గత రెండు నెలలుగా ప్రజలు నీళ్ల కోసం నీటి ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. మరోవైపు ఎండాకాలం ప్రారంభం కాకముందే పరిస్థితి ఇలా ఉంటే.. మునుముందు రోజుల్లో పరిస్థితి ఇంకెలా ఉంటుందో అని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు. తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో నగరంలో రోజుకు 2,600 నుంచి 2,800 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ పర్ డే) నీటి అవసరం ఉంటే కేవలం 1,300 ఎంఎల్‌డీ నీరు మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అంటే, అవసరమైన నీటిలో సగం కూడా సరఫరా జరగడం లేదు. దీంతో నీళ్ల ట్యాంకర్లు వచ్చినా సరిపోవడం లేదంటూ వాపోతున్నారు. నీటి కష్టాలు ఎప్పటికి తీరతాయో.. తమకు సాధారణ రోజులు ఎప్పటికి వస్తాయోనని తలలుపట్టుకుం టున్నారు.మళ్లీ వర్షాలు పడితే తప్ప పరిస్థితి మామూలు స్థితికి వచ్చేలా కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఈ క్రమంలో పాలకుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా అధికారంలోకి వస్తున్న ప్రభుత్వాలు రోడ్లు, అపార్ట్‌మెంట్లపై మాత్రమే దృష్టి పెడుతున్నారు. భూగర్భ జలాలలపై ఎన్నడైనా కృషి చేశారా? ఇలాంటి చర్యలు ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వమూ చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారువారందరితో సమావేశమయ్యారు? మరోవైపు నీటి కొరతను నివారించేందుకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేసింది. కాగా, రాష్ట్రంలోని 236 తాలూకాల్లో 219 తాలూకాలు తీవ్ర నీటి ఎద్దడితో ఇబ్బంది పడుతున్నాయని ప్రభుత్వం ఇటీవల నివేదికలో పేర్కొంది.

# యురేనియం ఊబిలో నల్లమల అడవి

యురేనియం అనే మానవ వినాశనకారి నల్లమల అడవి ప్రాంతంలో విస్తారంగా ఉందని తేలడంతో యూసిఎల్ అనే ఒక కేంద్ర ప్రభుత్వ సంస్థ నల్లమలపై కన్నేసింది. యురేనియం వెలికితీత ముసుగులో ప్రజా ప్రతినిధులు, కాంట్రాక్టర్లు, వారితో పాటు లంచగొండి అవినీతి అధికారులు చేతులు కలిపి, స్వచ్ఛమైన ఎలాంటి కల్మషం లేని అడవి బిడ్డల బతుకుల్ని అంధకారంలోకి నెట్టి వేయగలిగే ఒక కుట్ర ఇప్పుడు నల్లమల అడవి ప్రాంతం మీద పగబట్టింది.. దక్షిణ భారతదేశంలో సముద్ర మట్టానికి దాదాపు 1,000 మీటర్ల ఎత్తులో ప్రకృతి వైపరీత్యాలకు నిర్మూలనకు ఒక పెట్టని కోటవలె దక్కన్ పీఠభూమిలో దాగివున్న తెలంగాణ రాష్ట్రంలో నల్లమల అడవి ప్రాంతం ఎన్నో రకాల వన్య ప్రాణులకు అటవీ ఉత్పత్తులకు వాటి మీద ఆధారపడి జీవిస్తున్న గిరిజనులకు ఒక ఆవాస ప్రాంతంగా ఉంటూ, పర్యాటకులకు కనువిందు చేసే ఒక సుందరవనమై వికసిస్తుంది. యురేనియంను ఒక ఖనిజం నుండి వెలికి తీయవచ్చు. ఈ యురేనియం ద్వారా రేడియోధార్మిక శక్తిని కనుగొన్నారు.

వీటినుండి అసాధారణమైన శక్తి విడుదలై న్యూక్లియర్ ఎనర్జీ ఉత్పన్నం అవుతుంది. ఈ ఎనర్జీని అణుబాంబుల తయారికి, శాటిలైట్ లాంచింగ్ వెహికల్‌లో ఇందనంగా వాడతారు. 1950 దశకంలో అప్పటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ మన దేశంలో ఏడు యురేనియం బావులను, 22 న్యూక్లియర్ రియాక్టర్ల ఏర్పాటును ప్రతిపాదించగా 1967 సంవత్సరంలో జార?ండ్ రాష్ట్రంలోని జూదుగూడా అనే ప్రాంతంలో యురేనియం బావిని ప్రారంభించారు. ఈ బావి నుండి వెలుపడే వ్యర్థాల మూలంగా అక్కడ నివసిస్తున్న ప్రజలు అనేక రకాల అనారోగ్య పరిస్థితులకు గురికావడం తెలిసిన విషయమే. జూదుగుడా యురేనియం బావి మూసివేతకు అక్కడి ప్రజల ఆరోగ్య పరిస్థితులను కాపాడడం కోసం ఎన్నో రకాల ఎన్జీవో సంస్థలు సర్వే వివరాలను ప్రభుత్వాలకు విన్నవించాయి. ఎన్జీవోస్ ఇచ్చిన నివేదికలో వాస్తవాలు తెలుసుకోవడం కోసం అప్పటి ప్రభుత్వం బార్క్ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఒక కమిటీని వేయడం జరిగింది. ఎన్జీవో సంస్థలు ఇచ్చిన నివేదిక యురేనియం తవ్వకాలకు పూర్తిగా విరుద్ధంగా ఉందంటూ కమిటీ తన రిపోర్టును ప్రభుత్వానికి అందజేయడం జరిగింది. బార్క్ నివేదికను ఆధారంగా చేసుకుని జూదుగూడలో కొన్ని సంవత్సరాలు యురేనియం




తవ్వకాలు యధావిధిగా కొనసాగాయి.

1998లో వాజ్‌పేయి ప్రభుత్వం అక్కడ ప్రజలు చేస్తున్న పర్యావరణ పరిరక్షణ, రైతు ఉద్యమాలకు తలొగ్గి జూదుగూడ యురేనియం బావిని మూసి వేస్తున్నట్లు ప్రకటించారు. తదనంతరం భారత ప్రభుత్వం యూసీఐఎల్ ఆధ్వర్యంలో 2007 నవంబర్ 27న అప్పటి ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా తుమ్మలపల్లి గ్రామంలో, గుంటూరు జిల్లా కొప్పునూరు గ్రామంలో దాదాపు లక్ష అరవై వేల టన్నుల యురేనియం ఖనిజాన్ని వెలికి తీశారు తరువాత అక్కడ నిలువలు అయిపోవడం మూలంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కన్ను... పచ్చని అడవితో ప్రకృతి కనువిందులతో పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేసే నల్లమల అడవి ప్రాంతంపై పడడం జరిగింది. ఇక్కడ యురేనియం నిల్వలు ఉన్నట్లు యూసీఐఎల్ గుర్తించింది. ఈ తవ్వకాల కోసం దాదాపు 5 సంవత్సరాల నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికలు రచిస్తున్నారు. కానీ యురేనియం ద్వారా వెలువడే వ్యర్థాలు కృష్ణానదిలో కలిస్తే మానవాళి, వన్యప్రాణులు, అక్కడ నివసించే గిరిజన ప్రాంత ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. యురేనియం ద్వారా వెలుపడే రసాయనాలు గాలిలో కలవడం వల్ల గాలి విషతుల్యమై దాని ప్రభావం దాదాపు 8 మైళ్ల దూరం వరకు వ్యాపిస్తుంది. అలా వ్యాపించిన విషతుల్యమైన గాలిని పీల్చుకోవడం వలన ఆ పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎన్నో రకాల ఇబ్బందులకు గురవుతారని జార?ండ్ రాష్ట్రంలోని జూదుగుడా ఉదంతం ద్వారా తేటతెల్లమైంది. సమాజ వినాశనకారి అయిన యురేనియం వెలికితీత నిర్ణయాన్ని వెంటనే ఆపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నాం.

# మహిమాన్వితుడు శ్రీ గురు రాఘవేంద్రుడు

**పూజ్యాయ రాఘవేంద్రాయ**
**సత్యధర్మ రతాయచ**
**భజతాం కల్పవృక్షాయ**
**నమతాం కామధేనవే.**



శ్రీ గురు రాఘవేంద్ర స్వామి (1595–1671) హిందూ మత ద్వైత సిద్ధాంతానికి సంబంధించిన ఒక ప్రముఖమైన గురువు. 16వ శతాబ్దంలో జీవించారు. ఆయన వైష్ణవాన్ని (విష్ణువుని కొలిచే సిద్ధాంతం) అనునయించారు, మధ్వాచార్యులు బోధించిన ద్వైతాన్ని అవలంబించారు. ఆయనను శిష్యగణం ప్రహ్లాదుడి అవతారంగా భావిస్తారు.మంత్రాలయంలో వెలసిన శ్రీ రాఘవేంద్ర తీర్థులు భక్త కోటికి కష్టాలు కడ తేరుస్తూ మంత్రాలయం మహర్షిగా భక్తుల పూజలు అందు కుంటున్నారు. మంత్రాలయ ఋషి రాఘవేంద్రులు మానవ కళ్యాణం కోసం వెలిసిన మహిమాన్విత మహనీయుడు శ్రీరాయలు. భక్తులు రాఘవేంద్ర స్వామిని శ్రీరాయలు అని పిలుచు కుంటారు. తమిళ నాడు లోని కుంభకోణం మధ్వ మఠాన్ని 1624 నుండి 1636 వరకూ మఠాధిపతిగా పాలించి ఆపై ఉత్తరానికి యాత్రలు చేసారు. ఆయన శ్రీమూల రాముడి, శ్రీ పంచముఖ ముఖ్య ప్రాణదేవరు (పంచముఖ హనుమంతుడు) యొక్క పరమ భక్తులు. పంచ ముఖిలో తపస్సు చేశారు. పంచ ముఖ హనుమంతుణ్ణి దర్శించారు.(హనుమంతుని పంచముఖ దర్శనం శ్రీరామ చంద్రులు తర్వాత దర్శించినది శ్రీ రాఘవేంద్ర తీర్థులు మాత్రమే) మంత్రాలయంలో తన మఠాన్ని స్థాపించారు. అక్కడే జీవ సమాధి పొందారు. శ్రీ రామవేంద్ర తీర్థ స్వామి విలక్షణ ప్రతిభగల, అద్భుత మహిమలు నెఱపిన మహనీయుడు. ఆయన తుంగ భద్ర తీరమునందు మంత్రాలయము అను ప్రదేశములో శ్రావణ బహుళ ద్వితీయ నాడు (క్రీ.శ.1671) బృందావనములో ప్రవేశించారు. ఆ దినాన్ని స్వామి ఆరాధనా దినంగా జరుపు కుంటారు. రాఘవేంద్ర తీర్థస్వామి అన్నది ఆ వ్యక్తి సన్యాసాశ్రమపు నామము.

పూర్వాశ్రమంలో ఆయన పేరు వెంకట భట్టు. తండ్రి పేరు వీర కృష్ణ భట్టు. తల్లి పేరు గోపమ్మ, ఆ దంపతులకు అతను చివరి కొడుకు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తుడైన వెంకటభట్టు చాలా తెలివైన వాడు. సంస్కృతంలో, కావ్యములు వేదాలు, మీమాంస మున్నగునవి ఆయన మధురకు చెందిన శ్రీలక్ష్మీ నరసింహాచారి వద్ద చదువు కున్నారు. తాత శ్రీకృష్ణ దేవరాయల ఆస్థాన వైణికుడిగా వుండేవారు. వెంకట నాథుడి బాల్యం లోనే తల్లిదండ్రులు గతిం చారు. బావగారైన లక్ష్మీనారాయణ చేర దీశారు. బావ పెంపకంలోనే వెంకట నాథుడు సర్వశాస్త్ర పారంగతు డయ్యారు. విద్యాభ్యాసానంతరము సరస్వతి బాయిని వివాహం చేసుకుని, పేదరికం కారణంగా, తన కాపురాన్ని కుంభ కోణమునకు మార్చారు. అక్కడ శ్రీ మధ్వాచార మత గురువులలో ఒకరైన శ్రీ సుధీంద్ర తీర్థ స్వామి వారికి శిష్యుడయ్యారు. గురువు చెప్పగా శిష్యుడు వ్యాఖ్య వ్రాస్తూ ఉంటూ ఉండేవారు. ఒకనాడు ఒక ఘటం గురువుకే విడివడలేదు. ఆలోచించి రేపు చెబుతానని గురువు ఆనాటికి పాఠం చూపించారు. ఆ రాత్రి శిష్యుడు గురువుకు సందేహం వచ్చిన ఘట్టానికి సంబంధించిన వ్యాఖ్య తాను రచించి మరీ నిద్రపోయారు. మరునాడు గురువు శిష్యుని ఎంతగానో పొగడి, ఇతర శిష్యుల సమక్షంలో 'పరిమళ ఆచార్య అను బిరుదం ఇచ్చారు. కొన్నాళ్లకు శ్రీ సుధీంద్ర తీర్థ స్వామికి జబ్బు చేయగా, తనకు అవసాన కాలం సమీపించిన విషయం తెలుసుకుని, తన అనంతరం మధ్వ పీఠం నడవడానికి వెంకట భట్టే తగిన వాడని నిర్ణయించారు.

మంత్ర ముగ్ధులయి రోగ నిర్ముక్తులు అవుతూ ఉండడం వల్ల దానికి మంత్రాలయం అనే పేరు వచ్చింది. ఆ గ్రామాన్ని నవాబు సిద్ధి మస్సానెత్‌ఖాన్, స్వామికి (మద్రాస్ డిస్ట్రిక్ట్ గెజిటీర్ పునర్ముద్రణ 1916 చాప్టర్ 15 ఆదోని తాలూకా పేజీ 213) శ్రోత్రియంగా ఇచ్చారు. మద్రాసు గవర్నర్ థామస్ మన్రోకు రాఘవేంద స్వామి చూపిన అద్భుతాలు బళ్లారి జిల్లా గెజిటీర్‌లో చూడవచ్చు. అలా రాఘవేంద్రుల యశశ్చంద్రికలు దశదిశలా పాకాయి. వెంకన్న పంతులు విశేష ధనం వెచ్చించి అక్కడ స్వామి బృందావనానికి ఏర్పాట్లు చేసి గుళ్లు గోపురాలు కట్టించారు. రాఘవేంద్రస్వామి సంగీతంలో కూడా నిష్ణాతులే, ఆయన కాలంలో ఆయనో గొప్ప వైణికుడు కూడా. గురువు తరువాత మఠం బాధ్యత లు స్వీకరించి ఆపై దక్షిణ భారత దేశమంతా విజయం చేయటానికి వెళ్లి వచ్చి, మార్గంలో ఎన్నో అద్భుతాలను తన శిష్య బృందానికి చూపిస్తూ మధ్వప్రోక్త ద్వైత సిద్ధాంతానికి బాగా ప్రచారం చేసారు. అసమాన శేముషీ దురంధరుడైన రాఘవేంద్రు నికి టిప్పణాచార్య చక్రవర్తిగా బిరుదు లభించింది. వ్యాకరణ శాస్త్రం లో ఆయన ప్రజ్ఞా పాటవా లకు మెచ్చి మహా భాష్యకార బిరుదంతో సన్మానించారు. ఆయన స్వతంత్ర రచనల్లో జైమిని పూర్వ మీమాంస సూత్రాలకు రాసిన భాష్యం భట్ట సంగ్రహం భారతీయ తత్వశాస్త్రానికి అపురూపమైన కానుక. వివిధ భాషలకు సులభంగా వ్యాఖ్యానాలు రచించి మధ్వ సిద్ధాంత ఔన్నత్యాన్ని ప్రతిపాదించారు.

ఐతరేయోపనిషత్తు మినహా తొమ్మిది ప్రధాన ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలు రచించారు. 1671 లో తన శిష్యబృందంతో రాబోయే 800 సంవత్సరాలు జీవించే ఉంటా నని చెప్పి మంత్రాలయంలో జీవ సమాధి పొందడానికి సంసిద్ధుడైనాడు. క్రీస్తుకు 1671 వ సంవత్సరం శ్రావణ బహుళ ద్వితీయ గురువారం నాడు శ్రీ రాఘవేంద్ర స్వామి బృందావనంలో ప్రవేశించారు. వేదమంత్ర పఠనం జరుగుతూ ఉండగా స్వామి అందులో కూర్చున్నారు. అక్కడ చేరిన వేలకొలది భక్తులు హరినామ కీర్తన సాగిస్తూ ఉండగా స్వామి నైమిత్తికాలు పూర్తి చేసుకుని శుచియై చేతిలో వీణను పట్టుకుని సమాధిలో ప్రవేశించారు. శ్వాసని నిలిపివేసి మనోలయం చేశారు. గండకీ నది నుంచి తెప్పించిన 1200 సాలిగ్రామాలతో బృందావన సమాధిని మూసి వేశారు. సమాధి గతుడైన తర్వాత ఆయన చూపిన మహిమలు, చేసిన అద్భుతాలు కోకొల్లలు. 700 సంవత్సరాలు సూక్ష్మరూపంలో బృందావనంలో ఉండి తన భక్తులను అనుగ్రహి స్తానని ఆయన ప్రకటన చేశారు. శ్రీరాఘవేంద్రులు జ్ఞాన సంపన్నుడు, సిద్ధ పురుషుడు. మంత్రాలయం లోని బృందావన సన్నిధానంలో భక్తులు పొందే శాంతి సంతృప్తుల మాటల కందనివి. అలజడి, అశాంతి, ఆందోళనలతో నిండిన నేటి నాగరిక సమాజానికి అటువంటి సత్పురుషుల సాహిత్యం, సాన్నిహిత్యం, సాన్నిధ్యం ఎంతో అవసరం. అది నిరంతరం వెలిగే అఖండ జ్యోతి. బ్రతికి ఉండగా జరిపిన అద్భుత మహిమలు స్వామి బృందావనంలో ప్రవేశించాక కూడా చేస్తూ వచ్చారు. చేస్తూరావడం చేతనే మంత్రాలయంలో శ్రావణ బహుళ ద్వితీయ ఏటేట గొప్ప తీర్థదినమై వరలుతూ ఉంది. మధ్వమత స్థులేకాక లింగాయతులు మున్నగు భిన్న మతస్థులు కూడా ఈ తీర్థానికి విశేషంగా వస్తారు. తీర్థం మూడు రోజులు సాగుతుంది. స్వామి తీర్థంతో పాటు గ్రామదేవత సంబరం కూడా సాగుతోంది. మహిమాన్వితు లైన రాఘవేంద్ర స్వామి జయంతి వేడుకలు ఆరు రోజుల పాటు సంప్రదాయ రీతిలో నిర్వహించడం సాంప్రదాయం.403వ పట్టాభిషేకం, మార్చి16వ తేదీ రాఘవేంద్ర స్వామి 429వ జన్మదినం సందర్భంగా మూల బృందావనానికి పంచా మృతం అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించ నున్నారు.

http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

# స్థానిక వార్తలు



# రైతుల పాలిట శపంగా నకిలి విత్తనాల దందా

- నాసిరకం విత్తనాలతో రైతులకు మోసం....
- రహదారి పై రైతుల ఆందోళన





**వాస్తవ నేస్తం,కోటగిరి:** నాసిరకం విత్తనాలతో మమ్మల్ని నట్టేట్లో ముంచారంటూ రైతులు రహదరిపై ఆందోళన చేపట్టారు. రైతులు తెలిపిన కథనం ప్రకారం కోటగిరి మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్ నుండి గంగా కావేరి వరి సీడ్ అని చెప్పి సోనా 25 అనే రకానికి చెందిన విత్తనాలను కోటగిరి మండలకేద్రంలోని మొత్తానికి 150 ఎకరాల రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టి మమ్మల్ని రోడ్లపైకి లగ్యారంటూ రైతులు వాపోతున్నారు. మరో పది పదిహేను రోజులలో చేతికి రావాల్సిన పంట ఇప్పటివరకు కూడా కర్ర పొట్ట దశకు రాకపోవడంతో భయాందోళన గుర్రై పది రోజుల క్రితమే గ్రోమోర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తమకు న్యాయం చేయాలంటూ గ్రోమోర్ కార్యాలయానికి వచ్చి అడుగగా పొంతలెని సమాధానం చెప్తున్నారని రైతుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ కు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి చేరుకొని వ్యవసాయ అధికారి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమకు న్యాయం చేయాలని రహదారిపై ఆందోళనకు దిగారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**వాస్తవ నేస్తం,**ఏర్గట్ల బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి ఎన్ఆర్జీఏస్ పథకం క్రింద మంజూరైన 20 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను శుక్రవారము ఏర్గట్ల మండల కేంద్రములో కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి కొరకు నిధులను మంజూరు చేపించిన సునీల్ రెడ్డి గారికి కాంగ్రెస్ పార్టీ తరుపున మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా మరిన్ని సీసీ రోడ్లు, మండల అభివృద్ధికి నిధులు తెచ్చి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివనోళ్ల శివకుమార్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్కూలుపై చర్యలు తీసుకోవాలి





**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం వేసవి కాలం దృష్ట్యా ఒంటి పూట బడులను ఈనెల 15 నుండి ప్రారంభించారు. ఒంటిపూట బడులు ప్రారంభమైన రోజే బజార్హత్నూర్ మండల కేంద్రంలోని శిశు మందిర్ గల పాఠశాల యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను బేఖతార్ చేస్తూ రెండు పూటలు పాఠశాల నిర్వహించిన పాఠశాల యజమాన్యం పై చర్యలు తీసుకోవాలని డీజీవీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొట్టురి ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఇట్టి విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నలగడ్డ లక్ష్మీ నరసమ్మ కు నివాళులర్పించిన పొన్నం వెంకటేశ్వరరావు

**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలోని గోవిందపురం ఎల్ గ్రామంలో ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత అత్త జొన్నలగడ్డ లక్ష్మీ నరసమ్మ(85) గురువారం మృతి చెందారు. శుక్రవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావులు ఆమె భౌతికాయం పై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, లక్ష్మీపురం సహకార సంఘం అధ్యక్షులు మాదినేని వీరభద్రరావు, ఐలూ రాష్ట్ర అధ్యక్షులు ఏడునూతల శ్రీనివాసరావు, సిపిఎం సీనియర్ నాయకులు మాజీ సర్పంచి మాదినేని నారాయణ, తదితరులు ఉన్నారు.

## పరామర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు



**వాస్తవ నేస్తం,బోనకల్:** మండల పరిధిలో గోవిందపురం ఎల్ గ్రామానికి చెందిన తమ్మారపు సక్కుబాయి గత నెల రోజుల క్రితం అనారోగ్యంతో హాస్పిటల్ లో చికిత్స పొంది కోలుకొని ఇంటికి రావడంతో శుక్రవారం సక్కుబాయి ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, లు పరామర్శించారు ఆమెను కొన్ని ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ తుళ్లూరి రమేష్ మాదినేని వీరభద్రం వై లక్ష్మణరావు సురేష్, కోట కాటయ్య, కళ్యాణపు బుచ్చయ్య , పసుపులేటి వెంకటి ,సిపిఎం సీనియర్ నాయకులు ఏసుపోగు బాబు తదితరులు ఉన్నారు.

## పశువులకు టీకాలు వేసిన ఎమ్మెల్యే



**వాస్తవ నేస్తం,భైంసా:** పశువుల పోషకులు పశువులకు తప్పనిసరిగా గాలి కుంటు నివారణ టీకాలు వేయించాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. శుక్రవారం భైంసా పట్టణంలోని గోశాలలో గోవులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఏప్రిల్ 15 తేది వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని గాలి కుంటు వ్యాధి సోకాకుండా టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు విఠల్, బీజేపీ నాయకులు ఉన్నారు.

# రైల్వే డిఆర్ఎమ్ కు వినతి పత్రం అందజేసిన మిత్రపక్షం నాయకులు




**వాస్తవ నేస్తం,బోనకల్ :** నూతనంగా ఏర్పాటు చేసిన మూడవ రైల్వే లైన్ తనిఖీల్లో భాగంగా శుక్రవారం బోనకల్ రైల్వే స్టేషన్ ను సందర్శించిన సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైను ను బోనకల్ మండల అఖిలపక్ష నాయకులు కలసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మించడం వలన ఇటు వైపు నివసిస్తున్న ప్రజలు ఖమ్మం బస్టాండ్ వైపుకు వెళ్లాలంటే సుమారు నాలుగు కిలోమీటర్లు వెళ్లవలసి వస్తుందని కావున ముష్టి గుంట పాత రైల్వే గేట్ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారూ. బోనకల్ ప్రాంతం నుండి పెనుగంచిప్రోలు లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయం తిరుమలగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం వేదాద్రి ముత్యాల దేవస్థానాలు నెమలి కృష్ణుడి దేవాలయం లకు దూర ప్రాంతాల నుండి భక్తులు ఇక్కడి నుండి ప్రయాణం కొనసాగిస్తుంటారని, వ్యాపారస్తులు మరియు వైద్య,విద్య నిమిత్తం హైదరాబాద్ లాంటి పట్టణాలకు వెళ్లాల్సిన వారు శాతవాహన,ఇంటర్ సిటీ లాంటి ఎక్ప్రెస్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తమ స్టేషన్లో శాతవాహన ఇంటర్సిటీలను ఆపాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం మండల అధ్యక్షుడు రావట్ల సత్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు గుగులోతు పంతు, కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేశ్వర్లు, పర్సనబోయిన వీరభద్రం,ఆర్యవైశ్య సంఘ నాయకులు పల్లబోతుల గోపి,రంగా జనార్దన్,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


# భయాందోళనలకు గురి కావద్దు, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి




ప్రధానోపాధ్యాయులు తల్లాడ శ్రీనివాసరావు

**వాస్తవ నేస్తం,అనంతగిరి:** మండల పరిధిలోని గొండ్రియల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి దాసోజు రామాచారి జ్ఞాపకార్థం గ్రామ పూర్వ విద్యార్థులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేళు ,,రబ్బర్లు, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పెన్సిళు కేయన్స్ అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండ్ల కరుణాకర్, శ్రీధర్, షేక్ హాసన్, మల్లయ్య బ్రహ్మం మోహన్ రావు రామకృష్ణ గురవయ్య, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పెన్ను ప్యాడ్లు వితరణ



**వాసవ నేసం,గుడిహత్నూర్:** విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగడం పెట్టుకుని చదువుపై దృష్టి సారించాలని ఎస్సై ఇమ్రాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేతకాని సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మన తెలంగాణ పాత్రికేయులు బండారి రవీందర్ తన తండ్రి కీర్తిశేషులు లింగయ్య స్మారకార్థం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులకు పదవ తరగతి తొలిమెట్టు లాంటిదని, బంగారు భవిష్యత్తును నిర్మించుకునేలా ప్రణాళికబద్ధంగా చదువుకొని పరీక్షలు రాయాలని అన్నారు.ప్రస్తుత కాలంలో ఆడపిల్లలే అన్ని రకాల పరీక్షలలో మంచి మార్కులు సాధించి ముందుకు సాగుతున్నారని,మగ పిల్లలకు కూడా వారికి దీటుగా మంచి మార్కులు సాధించేలా పట్టుదలతో చదవాలని సూచించారు. టీనేజి దశలో పిల్లలు ఆకర్షణలకు లోన్ అవుతారని ఆకర్షణలవైపు దృష్టి సారించకుండా ఐదు సంవత్సరాల పాటు కష్ట పడి చదువుకోవడం ద్వారా ఉన్నత స్థానం చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుందని అన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు సిఆర్ టి గా పనిచేస్తున్న సావిందర్ స్కెల్,పెన్సిల్లు ఇతర సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలోమన తెలంగాణ పాత్రికేయులు బండారి రవీందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ దేవదాస్, ఉపాధ్యాయ సిబ్బంది సంజీవ్, గంగయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి ఎస్సై సందీప్



**వాసవ నేస్తం,తానూర్:** విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని ఎస్సై లోకం సందీప్ అన్నారు. శుక్రవారం తానూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్సాహంగా పరీక్షలు రాయాలని, సెల్ఫోన్లుకు దూరంగా ఉండే విధంగా చేసుకోవాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100 కు ఫోన్ చేయాలని బాల్య వివాహాలను అరికట్టాలని పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలన్నారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భిణులకు డాక్టర్ పూజా రెడ్డి ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. 50 మంది గర్భిణులకు వివిధ రకాల వైద్య సేవలు అందించి ఉచితంగా మందులను అందించినట్లు తెలిపారు. గర్భిణులు పూర్తి ఆరోగ్య సూత్రాలను పాటించాలని, నిత్యం నడక, వైద్యుల సూచనల మేరకు వ్యాయామం చేయాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే పుట్టే బిడ్డ ఆరోగ్యంగా ఎటువంటి సమస్యలు లేకుండా పుడతారని అన్నారు.

## మున్నూరు కాపు కార్యవర్గం ఎన్నిక



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండల మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు.అధ్యక్షునిగా మంద లింగన్న,ఉపాధ్యక్షునిగా ఆకుల సంతోష్,గోపు చిన్నయ్య, కార్యదర్శిగా కుంట శ్రీనివాస్,క్యాషియర్ గా భోజన్న ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్నూరు కాపుల ఐక్యత, అభివృద్ధికి తమ వంతు శాయశక్తులా కృషిచేస్తామని ఐక్యతతో ఉండి మరింత అభివృద్ధి చెందాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మోహన్, కొండొల్ల దేవేందర్, అనుముల చిన్న సాయన్న, మల్లయ్య, సంజీవ్,శ్రీనివాస్,కృమ దేవన్న, నరసయ్య, గంగాధర్ సాయి బాబా సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు

## అన్నదమ్ములను కలిపిన ఎన్నికలు

**కొత్తపేట :** వారిద్దరూ తోడబుట్టిన అన్నదమ్ములు... కానీ పార్టీలు వేరు.. అన్న తెలుగు దేశం... తమ్ముడు జనసేన.. వారే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం చెందిన తెలుగుదేశం పార్టీ నేత బండారు సత్యానందరావు, జనసేన నేత బండారు శ్రీనివాస్. ఇద్దరు టికెట్ కోసం ప్రయత్నించారు.. గత ఎన్నికల్లో ప్రత్యర్థులుగా పోటీ చేశారు.. అయితే ఈసారి ఎన్నికల్లో పొత్తు ధర్మం ప్రకారం తెలుగుదేశం పార్టీకి కొత్తపేట సీటు ఖరారు చేసి అన్న బండారు సత్యానందరావుని అభ్యర్థిగా ప్రకటించారు. అయితే జనసేన నేత శ్రీనివాస్ దీంతో కంగుతిన్నారు...

# దగ్గుతో బాధపడుతున్నప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి?




దగ్గుతో బాధపడుతున్నప్పుడు ఖచ్చితంగా చాలా జాగ్రత్తగా ఉండాలి. లేదంటే ప్రాణానికే చాలా ప్రమాదం. దగ్గు ఉన్నప్పుడు సాయంత్రం ఉడికించిన ఆహారానికి బదులుగా 6 గంటల లోపు పండ్లను మాత్రమే ఆహారంగా తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్ త్వరగా తగ్గి దగ్గు తగ్గుతుందని వారు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల రాత్రి పడుకున్న తరువాత దగ్గు రాకుండా ఉంటుందని దగ్గుకు కారణమయ్యే ఇన్ఫెక్షన్ త్వరగా తగ్గుతుందని కాబట్టి దగ్గుతో బాధపడేటప్పుడు పండ్లను, పండ్ల రసాలను చక్కగా తీసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఉప్పు, నూనె, పంచదార ఎక్కువగా ఉన్న వాటిని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గడంతో పాటు కఫం, శ్లేష్మం ఇంకా ఎక్కువయ్యి దగ్గు ఇంకా ఎక్కువవుతుందని నిపుణులు చెబుతున్నారు. దగ్గు ఎక్కువగా ఉన్నప్పుడు పంచదార, బెల్లం, చల్లటి నీరు, చల్లటి పెరుగు వంటి వాటిని తీసుకోవడం మానేయాలని నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ కూడా దగ్గును మరింత ఎక్కువ చేస్తాయని వారు చెబుతున్నారు. పండ్ల రసాలు గొంతుకు ఎంతో హాయిగా ఉంటాయని ముఖ్యంగా నారింజ, బత్తాయి వంటి పండ్ల రసాల్లో కొద్దిగా తేనె కలిపి తీసుకోవడం దగ్గు త్వరగా తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కారణమయ్యే ఇన్ఫెక్షన్ తగ్గాలంటే మన శరీరంలో రోగనిరోధక వ్యవస్థ మరింత బలపడాలి. రోగనిరోధక వ్యవస్థ బలపడాలంటే మన శరీరానికి విటమిన్ సి, ఎ, ఇ, బి కాంప్లెక్స్ విటమిన్స్ అవసరమవుతాయి. ఈ పోషకాలు ఎంత ఎక్కువగా శరీరానికి అందితే తగ్గు అంత త్వరగా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పోషకాలు ఎక్కువగా పండ్లలల్లో ఉంటాయని వీటిని తీసుకోవడం వల్ల దగ్గు మరింత త్వరగా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. దగ్గుతో బాధపడుతున్నప్పుడు పండ్ల రసాలను తీసుకోవాలని వీటికి బదులుగా ఉప్పు, నూనె, పంచదార ఉన్న పదార్థాలను తీసుకోవడం మానేయాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా ఈ జాగ్రత్తలు పాటించండి.

# ఖాళీ కడుపుతో యాలకులు తినొచ్చా?

మన వంటింట్లో దొరికే మసాలా దినుసులలో యాలకులు కూడా ఒకటి. ఈ యాలకులని ఎన్నో రకాల వంటల్లో ఉపయోగిస్తూ ఉంటారు. ఇవి కేవలం రుచి పరంగానే మాత్రమే కాకుండా వాసన పరంగా కూడా ఎంతో అద్భుతంగా ఉంటాయి. యాలకులను తరచుగా వినియోగించడం వల్ల ఎన్నో రకాల సమస్యల నుంచి బయటపడవచ్చు. ఇందులో విటమిన్స్ తో పాటు ఫైబర్, జింక్, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం లాంటి అనేక పోషక పదార్థాలు ఉన్నాయి. నోటి దుర్వాసన లాంటి సాధారణ సమస్యలతో పాటు గుండెపోటు లాంటి అసాధారణ సమస్యలను నివారించడంలో యాలకులు కీలకపాత్ర వహిస్తాయి. బరువు తగ్గాలనుకునేవారు ప్రతిరోజు రాత్రి ఒక యాలకులు తిని ఒక గ్లాసు వేడి నీరు తాగడం వల్ల శరీరంలో ఉష్ణోగ్రతలు పెంచుతుంది. ఫలితంగా అధిక బరువు చెడు కొలెస్ట్రాల్ని తగ్గిస్తుంది. అయితే ఇన్ని పోషకాలు సమృద్ధిగా ఉండే యాలకులను ప్రతీరోజూ ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. మరి ఖాళీ కడుపుతో యాలకులు తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు మనం తెలుసుకుందాం.. ఖాళీ కడుపుతో యాలకులను తీసుకోవడం వల్ల పురుషులలో స్పెర్మ్ నాణ్యత మెరుగుపడుతుంది. స్పెర్మ్ కౌంట్ కూడా బాగా పెరుగుతుంది. లైంగిక సామర్థ్యాన్ని యాలుకలు మెరుగుపరుస్తాయి. అంతేకాదు విపరీతంగా బరువు ఉన్నవారు బరువు తగ్గడానికి రోజు ఖాళీ కడుపుతో యాలుకలను తీసుకోవడం ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. యాలకులలో ఉండే పోషకాలు బరువును తగ్గించడంలో గణనీయంగా పని చేస్తాయి. యాలకులలో ఉండే పోషకాలు క్యాన్సర్ కణాల అనియంత్రిత పెరుగుదలను నిరోధిస్తాయి. క్యాన్సర్ బారి నుండి రక్షణ కల్పిస్తాయి. యాలుకలు తీసుకోవడం వల్ల స్త్రీల లైంగిక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ప్రతిరోజు ఖాళీ కడుపుతో వీటిని తీసుకుంటే వీరిలో లైంగిక సామర్థ్యం పెరుగుతుంది. యాలుకలను ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు నుండి త్వరగా ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం యాలకులలో లభించే పోషకాలు దగ్గు సమస్య నుండి ఉపశమనాన్ని అందించడంలో ఎంతో ప్రయోజనకరంగా పరిగణించబడతాయి. చాలామంది నోటి దుర్వాసనతో బాధపడుతూ ఉంటారు. అలాంటి వాళ్ళు యాలుకలను నిత్యం ఖాళీ కడుపుతో తీసుకుంటే, ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాక ప్రతిరోజు ఇబ్బంది పడేవారు, ఎసిడిటీతో బాధపడేవారు యాలుకలను ఖాళీ కడుపుతో తీసుకుంటే ఎసిడిటీ నుండి ఉపశమనం లభిస్తుంది. జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుంది. గుండె ఆరోగ్యానికి కూడా యాలుకలు ఎంతో మేలు చేస్తాయి. యాలుకలు కొలెస్ట్రాల్ లెవల్స్ ను తగిస్తాయి. యాలుకలలో ఉండే పోషకాలతో రక్తపోటు కూడా అదుపులో ఉంటుంది.




# కిడ్నీలని క్లీన్ చేసే ఫుడ్స్ ఇవే?



మన కిడ్నీలు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండాలంటే ఖచ్చితంగా క్యాల్షియం ఎక్కువగా ఉండే ఆహారం తినడం చాలా అవసరం.. కిడ్నీ సమస్యలు ఉంటే క్యాల్షియం అధికంగా ఉండే ఆహారాన్ని తినకూడదని చాలా మంది భావిస్తారు.కానీ కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే కాల్షియం అధికంగా ఉండే ఆహారాలు అవసరం. కాల్షియం అధికంగా ఉండే ఆహారాలు మూత్రపిండాల ఆరోగ్యానికి మంచివిగా పరిగణిస్తారు. కిడ్నీ ఆరోగ్యానికి సోయా, బాదం పాలు, టోఫు, బలవర్థకమైన తృణధాన్యాలు తప్పకుండా తినండి.కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ ఆహారంలో ఈ రసాలను కూడా చేర్చుకోవడం మంచిది. మీకు కిడ్నీ సమస్యలు ఉంటే, మీ ఆహారంలో ఎర్ర ద్రాక్షను చేర్చుకోండి.సాయంత్రం అల్పాహారంగా కొన్ని ఎర్ర ద్రాక్షలను తినడం వల్ల మూత్రపిండాల ఆరోగ్యం మెరుగుపడుతుంది.ఇందులో ఉండే రెస్వెరాట్రాల్ సమ్మేళనం కిడ్నీ వాపు ఇంకా చికాకును తగ్గిస్తుంది.అలాగే కిడ్నీలను శుభ్రం చేయాలనుకుంటే ఆరెంజ్ జ్యూస్ తయారు చేసి తాగండి. విటమిన్ సి, సిట్రిక్ యాసిడ్ కలిగిన ఈ పండు చాలా మేలు చేస్తుంది. దీన్ని తాగడం వల్ల మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడటం ఆగిపోతుంది.ఇంకా అలాగే పుచ్చకాయ, క్యారెట్, దోసకాయల రసాన్ని అల్పాహారంగా త్రాగాలి. కిడ్నీలోని మురికిని బయటకు పంపడంలో ఈ జ్యూస్ చాలా సహాయపడుతుంది.బీట్‌రూట్, నిమ్మరసం, చిన్న అల్లం ముక్కలను కలపండి. వీటని జ్యూస్ గా తయారు చేసుకోండి.. తర్వాత ఈ జ్యూస్‌ని ఉదయాన్నే వడగట్టి తాగడం వల్ల కిడ్నీలోని మురికి తొలగిపోతుంది.కిడ్నీలను డిటాక్స్ చేయాలనుకుంటే ఖచ్చితంగా ఈ జ్యూస్‌లను తాగండి.. వీటితో మన కిడ్నీలను ఈజీగా శుభ్రం చేసుకోవచ్చు.

# టిఫిన్‌లోకి ఇడ్లీ దోశ తినడం అంటే ఇష్టమా?



సాధారణంగా చాలామంది పొద్దున లేవగానే కాఫీలు టీలు పడందే పొద్దుగడవదు. ఈ కాఫీ,టీలతోనే ఆరోగ్యం చెడగొట్టుకుంటూ ఉన్నారంటే,ఇక టిఫిన్ మాట చెప్పనక్కర్లేదు. టిఫిన్ సమయంలో ఎక్కువగా చాలామంది ఇడ్లీ ,దోశ తినడానికి ఇష్టపడుతున్నారు. మరి ముఖ్యంగా ఇడ్లీ అంటే చాలా ఈజీగా అరుగుదల అవుతుందని,తక్కువ క్యాలరీలు ఉంటాయని అపోహ పడుతూ ఉంటారు. కానీ దీనివల్ల చాలా అనారోగ్య సమస్యలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు ఆహార నిపుణులు. ఇవి దీర్ఘకాలం పాటు తింటే అంతే సంగతులట. మరి ఇంకెందుకు ఆలస్యం ఆ అనారోగ్య సమస్యలు ఏంటో మనము తెలుసుకుందాం పదండీ.. నిజానికి బియ్యం లో ఉన్న క్యాలరీల కన్నా,మినపప్పు లోనే అధికంగా క్యాలరీలో ఉంటాయి. ఎవరైతే డైట్ చేయాలని ఇడ్లీ దోశలు తింటూ ఉంటారో,వారికి ఎటువంటి ప్రయోజనము కలగదు. ఎందుకంటే ఇడ్లీ,దోశలను బియ్యము మరియు మినపప్పులతో తయారుచేస్తారు కనుక. ఇందులో ఉన్న కార్బోహైడ్రేట్స్ వారి బరువును మరింత పెంచుతుందే తప్ప తగ్గించదు. రోజు దోశ మరియు ఇడ్లీలను పులియబెట్టిన పిండితోనే తయారు చేస్తారు. కనుక ఇందులో ఉన్న బ్యాక్టీరియా క్రమంగా కడుపులో గ్యాస్ట్రిక్ యాసిడ్స్ ని ఎఫెక్ట్ చేసి, గ్యాస్ ఫార్మ్ అయ్యేలా ప్రేరేపిస్తుంది. దీనితో గ్యాస్,అజీర్తి సమస్యలు కలుగుతాయి. ఇడ్లీ,దోశ బ్యాటర్ లో ఉన్న కార్బోహైడ్రేట్స్ రక్తంలోని గ్లూకోస్ లెవ్వాల్సిన పెంచి,మధుమేహానికి దారి తీస్తాయి. ఇక ఆల్రెడీ మధుమేహంతో బాధపడేవారు వీటికి ఎంత దూరంగా ఉండే అంత మంచిది. వీటన్నిటి బదులుగా పూర్వకాలంలో మన పెద్దలు అందించిన ఆహారాలు తినడం చాలా బెటర్ అని చెబుతున్నారు ఆహార నిపుణులు.

# ఎండబారి నుంచి తప్పించుకోండి ఇలా..




ఎండలు ఇప్పటికే తీవ్రరూపం దాల్చాయి. చాలామంది ఎండల ధాటికి వడదెబ్బకు గురవుతున్నారు. ఎండ బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. వీలైనంత వరకు ఎండలోకి వెళ్లడం మానుకోవాలి. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే తెల్లటి గొడుగు ఉపయోగించండి మీన రాశిలో సూర్య సంచారం వల్ల ఈ రాశు లకి అశుభం, పనిలో ఆటంకాలు ఉంటాయి. నలుపు మరియు నీలం రంగులు సూర్యరశ్మిని త్వరగా గ్రహిస్తాయి కాబట్టి నలుపు మరియు నీలం రంగుల బట్టలు ధరించవద్దు. వీలైనంత వరకు కాటన్ దుస్తులు ధరించండి. వృద్ధులు మరియు పిల్లలకు ఇంట్లో ఎక్కువ నీరు త్రాగడానికి ఇవ్వండి. ఈ ఎండలో విటమిన్ 'సి' లోపించడం వల్ల నిమ్మరసం ఎక్కువ చేసి తాగండి. పంచదారకు బదులు బెల్లం వాడండి. తులసి ఆకులను మిక్సీలో వేసి మెత్తగా నూరి రెండు గ్లాసుల నీళ్లతో ఉదయం నిద్రలేచిన వెంటనే తాగితే పనిలో అలసట రాదు. ఆహారంలో ఎక్కువ మసాలాలు వాడకూడదు, మసాలాల వల్ల మలద్వారంలో వేడి ఎక్కువై మలవిసర్జనలో ఇబ్బంది ఏర్పడి పైల్స్ వచ్చే అవకాశం ఎక్కువ. ఈ సమయంలో తల, మెదడు చల్లగా ఉండాలి కాబట్టి రెండు రోజులకు ఒకసారి రాత్రి పడుకునేటప్పుడు పటిక నూనె రాసుకుని, కొబ్బరినూనెకు బదులు ఉదయాన్నే తలస్నానం చేయాలి. పడుకునే ముందు చల్లటి నీళ్ల గుడ్డతో నేలను తుడిచి పల్చని గుడ్డపై పడుకోవడం మంచిది, మంచం మీద నుంచి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. గింజలను అరగంట సేపు నీళ్లలో నానబెట్టి తర్వాత మిక్సీలో జ్యూస్ తయారు చేసి రోజుకు రెండుసార్లు తాగితే శరీరం చల్లగా ఉంటుంది. ఈ సమయంలో పెరుగుకు బదులుగా మజ్జిగను వాడండి, ఎందుకంటే ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది.

# బెల్లం టీ తాగుతున్నారా?


ప్రస్తుత రోజుల్లో చాలామంది తీపి పదార్థాలలో చక్కెరకు బదులుగా ఎక్కువగా బెల్లాన్ని వినియోగిస్తున్నారు. అటువంటి వాటిలో బెల్లం టీ కూడా ఒకటి. చాలామంది టీ కాఫీలలో చక్కెరకు బదులుగా బెల్లంని ఉపయోగిస్తున్నారు.సాధారణంగా ఎక్కువమంది ప్రజలకు కాఫీ, టీ అలవాటు ఉంటుంది. చలికాలంలో పొద్దున్నే ఒక చుక్క వేడి వేడి టీ తాగాలని అందరూ అనుకుంటారు. దాంతో కొందరు బెల్లంతో తయారు చేసిన టీలు తాగితే మరికొందరు చెక్కరతో తయారు చేసిన తయారు టీలు తాగుతూ ఉంటారు.మీరు కూడా తరచుగా బెల్లంతో తయారు చేసిన టీ తాగుతూ ఉంటే వెంటనే ఇది తెలుసుకోండి.. బెల్లంటీ తాగితే బరువు తగ్గడమే కాకుండా కొన్ని దీర్ఘకాలిక సమస్యలకు కూడా దూరంగా ఉండవచ్చు. క్రమం తప్పకుండా బెల్లంటీ తాగుతుండటంవల్ల జీర్ణక్రియ సమస్యలు తగ్గుతాయి. యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉంటాయి కాబట్టి జీర్ణక్రియ పెరుగుతుంది. మలబద్ధకం, అజీర్తి, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి. చలికాలంలో చాలామంది సులువుగా బరువు పెర్నుగుతుంటారు. బరువు తగ్గాలనుకునేవారు ఆహారాన్ని మార్చి తీసుకోవాలి. కొవ్వును కరిగించడంలో బెల్లం టీ బాగా పనిచేస్తుంది. శీతాకాలంలో బెల్లంతో చేసిన ఆహారాలు తీసుకోవడంవల్ల శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. అదే శరీరానికి బలంగా మారుతుంది. మహిళలు కూడా బెల్లంటీని తాగాలి. ఇందులో అనేకరకాల పోషకాలు లభిస్తాయి. మహిళల్లో వచ్చే నెలసరి నొప్పులు కూడా బెల్లంటీతో తగ్గించుకోవచ్చు. పీరియడ్స్ లో వచ్చే నొప్పిని తగ్గించడంలో బెల్లంటీ చాలాబాగా పనిచేస్తుంది.





# స్థానిక వార్తలు

## సిరార ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



**వాస్తవ నేస్తం,భైంసా:** గతంలో భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు తెగిపోవ డంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చే స్తూ జీవోను జారీ చేసిందని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ తెలిపారు. ప్రాజెక్టు కట్ట తెగిపోవడం మూలంగా ఆయకట్టు దారులుకు తీరని నష్టం జరిగింది. ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 12 కోట్ల 37 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వగా, ఆయకట్టుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి, సంబంధిత శాఖ మంత్రికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

## మడత పెట్టి పక్కన పెట్టేశారు

**హైదరాబాద్ :** తొమ్మిదేళ్లు తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన గులాబీ పార్టీ జాతీయ పార్టీగా అవతరించింది. అయితే గత ఎన్నికల ఫలితాలతో డీలా పడింది. జాతీయ పార్టీ మాట దేముడెరుగు.. సొంత రాష్ట్రంలో మనుగడ కోసం ప్రయత్నాలు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తుందంటే ఎంతలో ఎంత డీలా పడిపోయింది? అని ప్రత్యేకంగా వేరే చెప్పాల్సిన పనిలేదు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన ఉద్యమ సంస్థగా తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటయింది. టీఆర్ఎస్ గా తెలంగాణ ప్రజల నోళ్లలో నానింది. కారు గుర్తును ఒకటి కాదు.. రెండు సార్లు గెలిపించి కేసీఆర్ ను ముఖ్యమంత్రిని చేశారు జనం. తెలంగాణ రాష్ట్రం ఆయన వల్లనే సాధ్యమయిందన్న నమ్మకంతోనే జనం గులాబీ పార్టీ వైపు మొగ్గుచూపారు.  ఎవరు చెప్పారో.. తెలీదు.. పేరు మారిస్తే మూడోసారి విజయం ఖాయమని చెప్పారేమో కూడా తెలియదు. కేసీఆర్ మస్కిష్కంలో పుట్టిన ఆలోచన అని కూడా చెప్పలేం. ఇలా కారణాలేవైనా టీఆర్ఎస్ ను ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ గా మార్చి పడేశాడు పెద్దాయన. తనను తప్ప మరెవ్వరినీ ప్రజలు ఆదరించరన్న ధైర్యం కావచ్చు. అందుకే టీఆర్ఎస్‌ను జాతీయ పార్టీగా తీర్చాలని, దేశాన్ని ఉద్ధరించాలని కారు వేసుకుని బయలుదేరారు సారు. ప్రధానంగా ఒడిశా, మహారాష్ట్రలపైనే ఆయన ఎక్కువ దృష్టి పెట్టారు. తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలపైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ లలో పార్టీ బలోపేతానికి పెద్దగా ప్రయత్నించలేదనే చెప్పాల్సి ఉంటుంది. అయితే మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలయింది. ఆ తర్వాత పరిస్థితులు వేగంగా మారాయి. గతంలో పొత్తుల ఊసే ఎత్తని కేసీఆర్ ఈసారి తెలంగాణలో ఎక్కువ స్థానాలను సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కమ్యునిస్టులతో ఉప ఎన్నికల్లో పొత్తును పెట్టుకున్న కేసీఆర్ సాధారణ ఎన్నికల్లో మాత్రం ఒంటరిగానే బరిలోకి దిగారు. గేరు మార్చుదామనుకున్న గులాబీ బాస్ కు ఫస్ట్ గేర్ నుంచి ముందుకు పడలేదు. దీంతో కేసీఆర్ అధికారానికి దూరంగా ఉండిపోవాల్సి వచ్చింది. అయితే ఇప్పుడు లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో ఆయన బీఆర్ఎస్ ను ఏ ఏ రాష్ట్రాల్లో పోట ?చేయించాలన్న దానిపై ఇంత వరకూ స్పష్టత రాలేదు. మహారాష్ట్రలో చాలా సభలు పెట్టి హడావిడి చేసిన కేసీఆర్ ఫలితాల తర్వాత అటువైపు చూడటం మానేశారు. దీంతో కేసీఆర్ కు మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. తాము పోటీ చేయాలా? వద్దా? చెప్పాలంటూ వారు అల్టిమేటం ఇస్తున్నారు. బీఆర్ఎస్ వద్ద నిధులు పుష్కలంగా ఉన్నాయి. నిధుల కొరత లేకపోవడంతో పోటీ చేసి తాము కూడా రాజకీయాల్లో సత్తా చాటాలని భావించి అధికారంలో ఉన్నప్పుడు పార్టీలో చేరిన నేతలు ఇప్పుడు డైలమాలో పడ్డారు. ఒడిశా బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతలందరూ రాజీనామా చేసేశారు. ఏపీలోనూ అంతే పరిస్థితి. ఇక మహారాష్ట్రలో కూడా తమ సంగతి ఏందో చెప్పాలంటూ నిలదీయడం ప్రారంభమయింది. మరి జాతీయ పార్టీగా ప్రకటించుకున్న కేసీఆర్ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఏ ఏ రాష్ట్రాల్లో పోటీ చేస్తారు? కేవలం తెలంగాణకు మాత్రమే పరిమితమవుతారా? అన్నది మరికొద్ది రోజుల్లోనే తెలియనుంది.

## ఎమ్మెల్యే సోదరుడు అరెస్టు

**సంగారెడ్డి :** పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసారు. సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్స్ ను నిబంధనలకు విరుద్ధంగా నడిపాడనే కారణంతో అయనను పటాన్ చెరు పోలీసులు అరెస్టు చేసారు.శుక్రవారం తెల్లవారుజామునే గూడెం మధు ఇంటికి చేరుకున్న పోలీసులు, అయననుఅదుపులో తీసుకుని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## పటాన్ చెరు పోలీస్ స్టేషన్ ముందు ఉద్రిక్తత

**సంగారెడ్డి :** శుక్రవారం ఉదయం పటాన్ చెరు పోలీసు స్టేషన్ ముందు ఉద్రిక్తత నెలకొంది.ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తీసుకెళ్తుండగా బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీస్ వాహనంపై దాడి చేసారు. కార్యకర్తల్ని నిలువరించి నేరుగా వైద్య పరీక్షల కోసం సంగారెడ్డి జిల్లా ఆస్పత్రికి పోలీసులు తీసుకెళ్లారు.

## ప్రతి 15 నిమిషాలకు ఒక కారు చోరీ

**హైదరాబాద్ :** వాహనాల చోరీకి సంబంధించిన సంఘటనలు ప్రతిరోజూ వినిపిస్తున్నాయి, అయితే ఇటీవలి ఐఅఖా దొంగతనం నివేదిక కొన్ని షాకింగ్ విషయాలు వెల్లడించింది. దేశ రాజధాని ఢిల్లీ దొంగలకు అత్యంత ఇష్టమైన నగరమని, అందుకే ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ప్రతి 14 నిమిషాలకు ఒక కారు దొంగిలించబడుతుందని ఈ నివేదికలో చెప్పబడింది. ఇది కాకుండా మంగళ, ఆది, గురువారాల్లో వాహనాలు ఎక్కువగా చోరీకి గురవుతున్నాయని తెలిసింది. మిగిలిన రోజుల్లో ఏ కారు చోరీకి గురికాలేదని కాదు, ఇతర రోజులతో పోలిస్తే ఈ మూడు రోజుల్లోనే అత్యధిక సంఖ్యలో వాహనాలు చోరీకి గురయ్యాయి. ఏడు రోజులూ దొంగలు కార్లపై నిఘా ఉంచుతారు. దేశంలో అత్యధికంగా వాహనాలు దొంగిలించబడుతున్న ఐదు నగరాలు ఉన్నాయి. ఈ టాప్ 5 జాబితాలో మొదటి పేరు ఢిల్లీ. చెన్నై రెండో స్థానంలో, బెంగళూరు మూడో స్థానంలో, హైదరాబాద్, ముంబై నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీలోని భజన్‌పురా, షాహదారా, పట్‌పర్‌గంజ్, బదర్‌పూర్ మరియు ఉత్తమ్ నగర్‌లో ప్రజల వాహనాలు ఎక్కువగాదొంగిలించబడుతున్నాయి. ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, నిస్సందేహంగా అత్యధిక సంఖ్యలో వాహనాలు చోరీకి గురయ్యే నగరం ఢిల్లీ అయితే మరోవైపు 2022తో పోలిస్తే 2023లో ఢిల్లీలో వాహన దొంగతనాల గ్రాఫ్ పడిపోయింది. ఢిల్లీ నగరంలో 2022లో 56 శాతం వాహనాలు చోరీకి గురికాగా, 2023లో ఈ గ్రాఫ్ 37 శాతానికి తగ్గింది.2022తో పోలిస్తే 2023లో తక్కువ వాహనాలు దొంగతనం జరగడం విశేషం. అత్యధికంగా దొంగిలించబడిన వాహనాల్లో 47 శాతం మారుతీ సుజుకీ వాహనాలేనని ఐఅఖా నివేదిక వెల్లడించింది.

# కమలంలో వలస నేతలకే పెద్ద పీట

**హైదరాబాద్ :** భారతీయ జనతా పార్టీ బుధవారం రాత్రి విడుదల చేసిన రెండో జాబితాలో ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన నేతలకే టికెట్లు ఖరారు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు సంపాదించి మూడో సారి నరేంద్రమోదీని ప్రధాన మంత్రిని చేయాలనే లక్ష్యంతో కమలనాథులు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి మూడు రోజుల క్రితం పార్టీలో చేరిన నలుగురు నేతలకు బీజేపీ టికెట్లు ఇచ్చారు. దీనిపై గత కొంత కాలంగా బీజేపీలో పనిచేస్తున్న సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. ఇది సహజమే.మొదటి జాబితాలోనూ ఫిరాయింపు దార్లకే పెద్ద పీట వేశారు. రెండో జాబితా అంతే. ఇక మూడో జాబితాలో రాబోయే రెండు సీట్లు ఫిరాయింపు నేతలకే ఇవ్వడం ఖాయం. తెలంగాణలో బలపడ్డామంటున్న బీజేపీకి బలమైన అభ్యర్థులు లేరా ? ఆదిలాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, మాజీ ఎంపీ గొడం నగేష్ ను బీఆర్ఎస్ పార్టీ నుంచి రప్పించి కాషాయం కండువా కప్పిన మూడు రోజుల్లోనే టికెట్టు ఇచ్చారు. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో సిట్టింగ్ ఎమ్మెల్యేలున్న బీజేపీ గోండు వర్గానికి చెందిన గొడం నగేష్ ను బరిలోకి దించడం ద్వారా విజయం సాధించాలని అనుకుంది. ఆదిలాబాద్ బీజేపీ టికెట్టు ఆశించిన సిట్టింగ్ ఎంపీ సోయంబాపురావు, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ లు తీవ్ర అసంతృప్తి జ్వాలలతో రగులుతున్నారు. పార్టీలో ఉన్న తమను కాదని బీఆర్ఎస్ పార్టీ నేతకే టికెట్టిస్తారా అని వారు మండిపడుతున్నారు. పార్టీకి ఎవరూ లేని సమయంలో బీజేపీలో చేరి పోటీ చేసి.. ఎంపీగా గెలిచానని సోయం బాపూ రావు అంటున్నారు. పార్టీలో తనకు అవమానం జరిగిందని.. పార్టీ మారిపోవడానికి సిద్ధమని ఆయన అంటున్నారు. మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడ్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ ను బీజేపీ బరిలోకి దించింది. ఇటీవల వరంగల్ జిల్లా పర్యటన సందర్భంగా కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి సీతారాం నాయక్ ఇంటికి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఢిల్లీకి పిలిపించి ఆయనకు కేంద్ర నేతలతో కాషాయ కండువా కప్పి ఎన్నికల బరిలోకి దించారు. మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సైదిరెడ్డిని నల్గొండ ఎంపీ బరిలో దించారు. బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పిన సైదిరెడ్డి కమలం పార్టీలో చేరిన మూడు రోజులకే టికెట్ దక్కించుకున్నారు. బీజేపీ మొదటి జాబితాలోనూ బీఆర్ఎస్ అభ్యర్థులు .. బీజేపీ అభ్యర్థులుగా ఎంపీ ఎన్నికల్లో బరిలోకి దించారు. మొదటి జాబితా ప్రకటించడానికి ముందు నాగర్ కర్నూలు ఎంపీ పోతుగంటి రాములు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరిపోయారు. వారికి టిక్కెట్లు ఇచ్చేశారు. పోతుగంటి రాములు కుమారుడికి చాన్సిచ్చారు. ప్పటికే 9 మంది అభ్యర్థులను మొదటి



జాబితాలో ప్రకటించింది. నిజామాబాద్ నుంచి ధర్మపురి అర్వింద్, కరీంనగర్ నుంచి బండి సంజయ్, భువనగిరి నుంచి బూర నర్సయ్య గౌడ్, మల్కాజిగి నుంచి ఈటల రాజేందర్, సికింద్రాబాద్ నుంచి కిషన్ రెడ్డి, హైదరాబాద్ నుంచి మాధవి లత , జహీరాబాద్ నుంచి బీబీ పాటిల్, నాగర్ కర్నూలు నుంచి భరత్, చెవేళ్ల నుంచి కొండ విశ్వేశ్వర్ రెడ్డి పోటీ చేస్తారు. ఇందులో బండి సంజయ్ , కిషన్ రెడ్డి మాత్రమే బీజేపీని అంటి పెట్టుకుని ఉన్నారు. మిగతా అంతా ఇతర పార్టీల నుంచి వచ్చిన వారే. రెండో జాబితాతో కలిసి మొత్తం తెలంగాణలో పదిహేను స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లు అయింది. ఇంకా రెండు స్థానాలు పెండింగ్ లో ఉన్నాయి. ఒకటి ఖమ్మం నియోజకవర్గం కాగా.. మరొకటి వరంగల్ నియోజకవర్గం. ఈ రెండింటిలోనూ ఫిరాయింపు దార్లకే చాన్సివ్వనున్నారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారు. సొంత పార్టీ నేతలకు పెద్దగా బలం లేకపోవడంతో ఇతర పార్టీల నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. రెండు రోజుల కిందట జలగం వెంకట్రావు పార్టీలో చేరారు. అయితే ఆయనకు టిక్కెట్ ప్రకటించలేదు. మరో కీలక నేత కూడా బీజేపీ తరపున పోటీకి సిద్ధమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. వరంగల్ నుంచి ఆరూరి రమేష్ పేరు ప్రచారంలో ఉంది. అంటే ఆ రెండు సీట్లు కూడా ఫిరాయిపు దారులకే ఇస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన డీకే అరుణ రాజకీయ మార్పులతో గతంలోనే కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. ప్రస్థుతం మాజీ కాంగ్రెస్ నాయకురాలైన డీకే అరుణను ఎన్నికలబరి లోకి దించారు. దీంతో మరో సీనియర్ నాయకుడైన జితేందర్ రెడ్డి అసంతృప్తికి గురయ్యారు.మెదక్ పార్లమెంటు బరిలో మాజీ ఎమ్మెల్యే ఎం రఘునందన్ రావును దించారు. రఘునందన్ రావు గతంలో టీఆర్ఎస్ పార్టీలో పనిచేసి, ఆపై బీజేపీ తీర్థం స్వీకరించారు. గతంలో దుబ్బాక నుంచి ఎమ్మెల్యేగా ఉప ఎన్నికల్లో గెలిచారు. పెద్దపల్లి పార్లమెంట్ బరిలో బీజేపీ అభ్యర్థిగా గోమాస శ్రీనివాస్ ను రంగంలోకి దించారు. ఆయన బీఆర్ఎస్ లో మండల స్థాయి నేత. మొత్తం మీద బీజేపీ ఇతర పార్టీల్లో బలమైన అభ్యర్థులకు కాషాయ కండువా కప్పి వారికే బీజేపీ టికెట్లు ఇవ్వడంపై కమలం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. సొంత పార్టీ నేతలపై ఎందుకు నమ్మకం పెట్టుకోవడం లేదనేది.. రాజకీయ వర్గాలను సైతం ఆశ్చర్య పరుస్తున్న ప్రశ్న. గతంలో బీజేపీ సిద్దాంత పార్టీ. పార్టీలో చేరికలకు ఆపరేషన్లు చేసే వారు కాదు. బీజేపీ సిద్ధాంతాలను పూర్తిగా ఆకళింపు చేసుకుని కింది స్థాయి నుంచి ఎదిగిన వారే నేతలుగా ఉంటారు. కిషన్ రెడ్డి.. లక్ష్మణ్.. ఇంద్రసేనారెడ్డి ఇలాంటి వారంతా.. ఆ తరహా నేతలు. కానీ ఇప్పుడు.. బీజేపీని చూస్తే.. మొత్తం ఇతర పార్టీల నుంచి వచ్చిన వారే ఉంటున్నారు. వారికే ప్రాధాన్యం లభిస్తోంది. దీని వల్ల కింది స్థాయి నుంచి పని చేసుకుంటూ వస్తున్న వారికి నిరాశ కలుగుతోంది. తమ పని పనిచేయడం అవసరమా అన్న భావన కలుగుతోంది. పార్టీలో చేరే వారు ప్రజా నేతలా అంటే కానే కాదన్న వాదన ఉంది. కేవలం బీఆర్ఎస్ లో కొన్ని పదవులు అనుభవించడమే వారి ప్లస్ పాయింట్. అంత మాత్రానే సీట్లు ఇచ్చేస్తారా ?. ఇలా వచ్చిన వారు పార్టీని అంటి పెట్టుకుని ఉంటారా?

# అడ్డగోలుగా గంజాయి విక్రయాలు

**హైదరాబాద్ :** రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలను పూర్తిగా నివారించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని పోలీసులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ మేరకు పోలీసులు సైతం ఎక్కడికక్కడ సోదాలు నిర్వహించి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. అయితే, తాజాగా నానక్ రాంగూడాలో గంజాయి విక్రయాలు కలక లం రేపాయి. ఓ మహిళ గంజాయిని బహిరంగంగానే విక్రయి స్తుండడాన్ని గుర్తించిన పోలీసులు షాకయ్యారు. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి పక్కా ప్రణాళికతో ఆమెతో సహా కొనుగోలు చేస్తున్న అందరినీ కటాకటాల్లోకి నెట్టారు. అయితే, ఆమె ఏళ్ల తరబడి ఈ దందా సాగిస్తుండడం గమనార్హం. పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో మత్తు పదార్థాల కట్టడికి ఏర్పాటైన తెలంగాణ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (టీన్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య డ్రగ్స్ కు సంబంధించిన సమాచారంపై తరచూ రాష్ట్రంలో అందరి పోలీసులనూ అప్రమత్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సిద్ధిపేట కమిషనరేట్ పోలీసులకు మత్తు పదార్థాల విక్రయంపై కొంత సమాచారం అందింది. ఇటీవలే ములుగు ప్రాంతంలో చిక్కిన ఇద్దరు గంజాయి విక్రేతలను విచారించగా తాము నానక్ రాంగూడలో తెచ్చామని పోలీసులకు తెలిపారు. దీంతో నిజానిజాలు తెలుసుకునేందుకు సిద్ధిపేట కమిషనర్ అనూరాధ ఓ బృందాన్ని అక్కడికి పంపారు. రహస్యంగా అక్కడకు వెళ్లిన పోలీసులు.. గంజాయి కొనేందుకు ఓ పెద్ద క్యూనే ఉండడం చూసి ఆశ్చర్యపోయారు. బహిరంగంగానే గంజాయి విక్రయాలు చేపట్టగా.. పదిహేను మంది క్యూలో నిలబడ్డారు. నీతూబాయి అనే మహిళ ఎలాంటి జంకూ గొంకూ లేకుండా గంజాయిని బహిరంగంగానే విక్రయిస్తుండడం చూసిన పోలీసులు షాకయ్యారు. గంజాయి కొనేందుకు ఉన్న క్యూలోనే పోలీసులు నిలబడి రూ.5 వేల గంజాయి కావాలని అడిగారు. ఆమె ఏమాత్రం భయం లేకుండా సరుకు ఇవ్వడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.



ప్రత్యేక బృందం అందించిన సమాచారాన్ని కమిషనర్ అనురాధ.. సందీప్ శాండిల్యకు వివరించారు. గంజాయి విక్రేత నీతుబాయిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకునేందుకు సందీప్ శాండిల్య ఆధ్వర్యంలో పోలీసుల బృందం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి సహకారంతో బృందాన్ని ఏర్పాటు చేసి నీతూబాయి ఇంటికి పంపారు. ఆమె ఇంటి లోపలికి వెళ్లేందుకు నాలుగు అంచెల్లో గ్రిల్స్ ఉన్నాయని.. ఒకవేళ పోలీసులు గ్రిల్స్ తొలగించుకుని వెళ్తే గంజాయిని మ్యాన్ హోల్ లో పడేసి తప్పించుకునే అవకాశం ఉందని.. సిద్ధిపేట పోలీసులు చెప్పడంతో అందుకు అనుగుణంగా ప్రణాళిక రచించారు. ఈ క్రమంలో తమ వెంట ఇద్దరు స్వీపర్లను తీసుకెళ్లారు. గ్రిల్స్ తొలగించే లోపు మ్యాన్ హోల్ ను బ్లాక్ చేసి గంజాయి కొట్టుకుపోకుండా సీజ్ చేయాలనేదే ప్లాన్. ఈ క్రమంలోనే పోలీసుల బృందం అక్కడకు వెళ్లింది. అప్పటికే అక్కడ 10 మంది గంజాయి కొనుగోలు చేస్తూ కనిపించారు. దీంతో రెడ్ హ్యాండెడ్ గానే నీతుబాయితో పాటు అందరినీ అరెస్ట్ చేశారు. ఆమె ఇంట్లో భారీగా గంజాయితో పాటు రూ.16 లక్షల నగదు సీజ్ చేశారు.కాగా, నిందితురాలు నీతుబాయిపై తొలుత 2017లో శేరిలింగంపల్లి ఎక్సైజ్ విభాగం కేసు నమోదు చేసింది. అనంతరం 2021 సెప్టెంబర్ వరకూ ఆమెపై 12 కేసులు నమోదు కావడంతో పీడీ చట్టం ప్రయోగించారు. ఏడాది అనంతరం జైలు నుంచి తిరిగి వచ్చిన 2 నెలలకే మళ్లీ గంజాయి విక్రయిస్తూ పోలీసులకు చిక్కింది. అలా గత అక్టోబర్ వరకూ మరో 6 కేసులు.. మొత్తం 18 కేసులు నిందితురాలిపై నమోదయ్యాయి. తాజాగా మరోసారి నీతూబాయిపై పీడీ చట్టం ప్రయోగించేందుకు పోలీసులు నివేదిక రూపొందించారు.నిందితురాలుమరోవైపు, సైబరాబాద్ పరిధిలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. జీడిమెట్లలో బీహార్ కు చెందిన శిబుకుమార్ అనే యువకుడు కిరాణా దుకాణంలో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నట్లు గుర్తించిన పోలీసులు దాడి చేసి నిందితున్ని అరెస్ట్ చేశారు. నిందితుని వద్ద రూ.11,500 విలువైన 150 గంజాయి చాక్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిని ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వలస కూలీలకు అమ్ముతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఏళ్ల తరబడి మహిళ మత్తు దందా, పోలీసుల ప్రత్యేక ఆపరేషన్ తో కటాకటాల్లోకి నిందితురాలుఅటు, రామచంద్రాపురం బాలాజీనగర్ లోని బీహార్ కు చెందిన సీతారామ్ సింగ్ అనే 60 ఏళ్ల వృద్ధుడు గంజాయి చాక్లెట్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించి మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుని వద్ద నుంచి రూ.30 వేల విలువైన గంజాయి చాక్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే, నిజాంపేట్ లోని పాన్ షాపులపై దాడి చేసి నిషేధిత సిగరెట్స్ పట్టుకున్నారు. నిందితులు చంద్రశేఖర్, బాలరాజ్ లను అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ టికెట్ వంశీకృష్ణకే ఇవ్వాలి

**పెద్దపల్లి :** పెద్దపల్లి ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణకే కాంగ్రెస్ టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు వునుకొండ శ్రీధర్ పటేల్ అధిష్టానాన్ని కోరారు. పెద్దపల్లిలో శుక్రవారం మీడియా సమావేశంలో సీనియర్ నాయకులు సజ్జాద్ తో కలిసి మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాకా వెంకటస్వామి కుటుంబంతో ఎంతో అభివృద్ధి జరిగిందని గుర్తు చేశారు. విశాఖ ట్రస్టు ద్వారా ఎన్నో ప్రజాహిత సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో మంచి గుర్తింపు పొందారని అన్నారు. కాకా కేంద్ర మంత్రిగా, వివేక్ ఎంపీగా ప్రజలకు విశేష సేవలందించారని తెలిపారు. కాకా వెంకటస్వామి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు సేవలందించేందుకు వివేక్ వెంకటస్వామి కుమారుడు గడ్డం వంశీకృష్ణకు పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిపేందుకు అధిష్టానం నిర్ణయం తీసుకోవాలని కోరారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్దే ధ్యేయంగా ముందుకెళ్తున్న వంశీకృష్ణ గెలుపు సులభమని ధీమా వ్యక్తంచేశారు. వంశీకృష్ణ అభ్యర్థిత్వాన్ని వెంటనే ప్రకటించాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు.

## గోదావరిఖని లేబర్ కార్యాలయంపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం


**కమాన్ పూర్ :** గోదావరిఖని లేబర్ కార్యాలయం పు లేబర్ ఆఫీసర్ పై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి అన్నారు. రామగిరి మండలం భవన నిర్మాణ కార్మికుల కార్యాలయంలో శుక్రవారం నాడు గ్రామ అధ్యక్షుడు ఎస్ కె షరీఫ్ జనరల్ సెక్రెటరీ కుసుమ సురేష్ ఏర్పాటుచేసిన సమావేశంలో స్వామి మాట్లాడుతూ లేబర్ కార్యాలయం పై కొంతమంది పని కట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అలాంటి ఆరోపణలు మానుకోవాలన్నారు.ఇప్పుడున్న లేబర్ అధికారి సకాలంలో మా కార్మికులకు లేబర్ కార్డు క్లెయిమ్స్ రూపాయి ఆశించకుండా సకాలంలో అందిస్తున్నారని అన్నారు.ఇంతకు ముందున్న అధికారి ఆఫీస్ కి వెళ్లిన పనులు జరిగేవి కావని, ఇప్పుడున్న అధికారి ఒక ఫోన్ కాల్ తోనే స్పందిస్తూ కార్మికుల సమస్యలను తెలుసుకుని వాటిని త్వరగా పరిష్కరిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలను మానుకోవాలని ఇతవు పలికారు.

# బంపర్ ఆఫర్ కొట్టేసిన పూజా హెగ్డే!



టాలీవుడ్ బుట్ట బొమ్మగా పేరు తెచ్చుకున్న పూజ హెగ్డే ఒక లైలా కోసం సినిమాతో సినీ ఇండస్ట్రీకి హీరోయిన్గా పరిచయమైంది. ఆ తర్వాత చాలా తక్కువ సమయంలోనే స్టార్ హీరోయిన్గా క్రేజ్ తెచ్చుకుంది.బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా మారింది. అంతేకాదు స్టార్ హీరోల సినిమాల్లో హీరోయిన్గా నటించే అవకాశాలను సైతం దక్కించుకుంది. స్టార్ హీరోయిన్లకు పోటీగా నిలిచింది. స్టార్ హీరో అంటే కచ్చితంగా పూజా హెగ్డే ఉండాల్సిందే అంత బిజీగా ఉండేది పూజా హెగ్డే. తెలుగులోనే కాకుండా తమిళ హిందీ వంటి భాషల్లో కూడా సినిమాలు చేసి ఒకప్పుడు భారీ క్రేజ్ తెచ్చుకుంది ఈ ముద్దుగుమ్మ. ఏకంగా ఒకేసారి మూడు భాషల్లో వరస సినిమాలు చేస్తూ గడిపిన రోజులు కూడా ఉన్నాయి. ఇక అలాంటి రోజుల నుండి ఎప్పుడో అస్సలే సినిమా అవకాశాలు లేని రోజులకు చేరుకుంది ఈ బ్యూటీ. ఈ మధ్యకాలంలో పూజ హెగ్డే నటించిన సినిమాలన్నీ కూడా డిజాస్టర్లు గా నిలిచాయి. దీంతో ఈ ముద్దుగుమ్మ ను సినిమాల్లోకి తీసుకోవడానికి భయపడుతున్నారు దర్శకనిర్మాతలు. ఇదిలా ఉంటే పూజా హెగ్డే ఈ ఫ్లాప్స్ నుంచి బయట పడాలని చూస్తుంది. ఈ క్రమంలో ఇప్పుడు ఈ చిన్నదానికి ఓ క్రేజీ ఆఫర్ వచ్చిందని తెలుస్తోంది.. అదికూడా టాలీవుడ్ నుంచి. పూజాహెగ్డే ఓ బడా హీరో లో ఛాన్స్ అందుకుందని తెలుస్తోంది. ఆ హీరో మరెవరో కాదు.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. గతంలో అల్లు అర్జున్పూజా హేగ్డ్ కాంబినేషన్ లో రెండు లు వచ్చాయి. హరీష్ శంకర్ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా నటించిన డీజే లో పూజా హీరోయిన్ గా నటించింది.

# ‘దేవర ఫస్ట్ సింగిల్‌కు ముహూర్తం ఫిక్స్?



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ చేస్తున్న తాజా చిత్రం ‘దేవర’ కొరటాల శివ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తుంది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్నాడు. ఇక ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తొలిభాగం 2024 అక్టోబర్ 10న విడుదల కానుంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌తో పాటు గ్లింప్స్ విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి ఒక సాలిడ్ రూమర్ బయటకు వచ్చింది. ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను మేకర్స్ లాంచ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మే 20 జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు ఈ సందర్భంగా ఆరోజే మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయనున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రకాష్‌రాజ్, శ్రీకాంత్, టామ్ షైన్ చాకో, నరైన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె నిర్మిస్తున్నారు.

# హీరోయిన్ ఛాన్స్ కొట్టేసిన బిగ్ బాస్ బ్యూటీ!




బుల్లితెర రియాలిటీ షోబిగ్ బాస్ తెలుగు సీజన్ సెవెన్ లో పాల్గొన్న రతిక రోజ్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తన అద్భుతమైన అందం తోపాటు మంచి మంచి పాటలను పాడుతూ ఒకింత మంచి గుర్తింపుని తెచ్చుకుంది ఈ బ్యూటీ. కానీ ఇంట్లో చేసే పనులతో బయట మాత్రం విపరీతమైన నెగెటివిటీ ని సొంతం చేసుకుంది. ముఖ్యంగా పల్లవి ప్రశాంత్ పై ఆమె వ్యవహరించిన తీరు వల్ల అతనికి బయట భారీ రేంజ్‌లో నెగెటివిటీ వచ్చింది. కానీ మళ్ళీ తిరిగి హౌస్ లోకి ఎంట్రీ ఇచ్చింది కానీ మళ్ళీ అది నెగిటివిటీతో బయటికి వచ్చింది. అయితే గతంలో ఈమె చాలా తెలుగు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా కనిపించింది. కానీ బిగ్బాస్ తర్వాత తనకి మెయిన్ లీడ్ లో నటించే అవకాశాలు వస్తున్నట్లుగా తెలుస్తోంది. ముఖ్యంగా రెండు పెద్ద సినిమాల్లో ఈ ముద్దుగుమ్మ కి హీరోయిన్ గా నటించే అవకాశం వచ్చినట్లుగా తెలుస్తోంది. ఇక ఈ విషయాన్ని స్వయంగా తానే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. అయితే బిగ్ బాస్ నుంచి వచ్చిన తర్వాత ఎక్కువగా కోకంటెస్టెంట్లతో కలవని ఈమె.. కెరియర్ లో ముందుకు వెళ్లేందుకు బాగానే ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఈమె అందం, అభినయానికి ఫిదా అయిన కొందరు తనకు సినిమాల్లో.. హీరోయిన్ గా ఛాన్స్ ఇచ్చారట.

# ‘ఆర్‌సీ 16’ మూవీకి ముహూర్తం ఫిక్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ‘ఉప్పెన’ డైరెక్టర్ బుచ్చిబాబు సాన కలయికలో ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రాగా.. త్వరలోనే షూటింగ్ ప్రారంభించనున్నారు. ఇక ‘ఆర్‌సీ 16’ అని వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఉత్తరాంధ్రలో జరిగే క్రీడా నేపథ్యంలో రానుంది. ప్రస్తుతం ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుపుకుంటుండగా.. తాజాగా మూవీ లాంఛ్‌కు సంబంధించి సాలిడ్ అప్‌డేట్‌ను ఇచ్చారు మేకర్స్. ఈ సినిమాను మార్చి 20న అధికారికంగా లాంఛ్ చేయనున్నట్లు సమాచారం. మార్చి 20న హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలు జరపడంతో పాటు ప్రెస్‌మీట్ కూడా నిర్వహించబోతున్నారని టాక్. ఇక ఈ వేడుకకు టాలీవుడ్ స్టార్ హీరో కూడా రానున్నట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమాకు ‘పెద్ది’ అనే టైటిల్ ఫిక్స్ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఇది నిజమో కాదో తెలియాలంటే మర్చి 20 వరకు వెయిట్ చేయాల్సిందే. ఉత్తరాంధ్ర స్పోర్ట్స్ బ్యాగ్‌డ్రాప్‌తో వస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీమూవీ మేకర్స్ సమర్పిస్తున్నది. వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలపై వెంకటసతీశ్ కిలారు అత్యంత భారీ వ్యయంతో నిర్మించనున్నారు. యూనివర్సల్ అప్పీల్ ఉండే పవర్‌ఫుల్ స్క్రిప్ట్‌ని బుచ్చిబాబు సిద్ధం చేశారని యూనిట్ సభ్యులు తెలిపారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ మొదలు కానుంది.

# మలయాళ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన అనుష్క!?



టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌అనుష్క శెట్టి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. టాలీవుడ్ కింగ్ నాగార్జున హీరోగా నటించిన సూపర్ సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత చాలా తక్కువ సమయంలోనే టాలీవుడ్ స్టార్ హీరోయిన్గా మారిపోయింది. దాదాపుగా తెలుగు స్టార్ హీరోల అందరి సరసన హీరోయిన్గా నటించిన అనుష్క ఇప్పటికే మూడు ఫిలింఫేర్ అవార్డులను రెండు నంది అవార్డులను రెండు సైమా అవార్డులను సైతం దక్కించుకుంది. దర్శక ధీరుడు రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి సినిమాతో హీరోయిన్గా నెక్స్ట్ లెవెల్ కి వెళ్ళిపోయింది. ఇక ఈ సినిమాతో ఈ బ్యూటీ కి ఫ్యాన్ ఇండియా లెవెల్లో క్రేజ్ దక్కింది. కాగా ఈ సినిమా తర్వాత చాలా కాలం సినిమాలకు దూరమైంది. మరి ఎందుకు సినిమాలకి బ్రేక్ ఇచ్చింది అన్న విషయం మాత్రం ఎప్పటి వరకు తెలియదు. ఇక సోషల్ మీడియాలో సైతం ఈ ముద్ద గుమ్మ అసలు యాక్టివ్ గా ఉండదు. తనకి సంబంధించిన ఎటువంటి అప్డేట్ల ను ఫాన్స్ తో పంచుకోదు. దీంతో అనుష్క అభిమానులు ఒకింత నిరాశ చెందుతున్నారు. ఆమె అధిక బరువుతో అనారోగ్యం పాలయ్యిందని.. అందుకే సినిమాలకు దూరంగా ఉంటూ కెమెరాలకు చిక్కకుండా తిరుగుతుంది అంటూ.. పలు వార్తలు వైరల్ అయ్యాయి. అయితే గతేడాది నవీన్ పోలిశెట్టితో కలిసి.. మిస్ శెట్టి మిస్టర్ పోలీశెట్టి సినిమాతో ఫ్యాన్స్ కు ట్రీట్ ఇచ్చింది. ఇక తాజాగా మరో మలయాళ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com